ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

కాకినాడ

జిల్లా వార్తలు


శుక్రవారం 16 మే 2025 | 5



కాకినాడ ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38(గురువారం)
కనిష్ఠం : 27

పిడుగుపడి కౌలు రైతు మృతి 7

కాకినాడలో యువకుడి హత్య



కొత్త కార్డుకు కష్టాలు

నిబంధనాలు

కూటమి ప్రభుత్వం నూతన రేషన్‌కార్డుల జారీ, కార్డుల విభజన, కొత్తగా కుటుంబ సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామా మార్పులకు దరఖాస్తుల స్వీకరణతో పాటు ఇప్పటికే రైస్ కార్డులు ఉన్న వారు వాటిని ప్రభుత్వానికి సరెండర్ చేసే అవకాశాన్ని కల్పించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లోని అన్ని వార్డు, గ్రామ సచివాలయాల్లో కొన్ని రోజులుగా దరఖాస్తుల స్వీకరణ జరుగుతోంది.దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రక్రియలో విధించిన నిబంధనలు ఇప్పుడు కొత్త కష్టాలు తెచ్చిపెట్టాయి. అన్ని సరిచూసుకుని అప్‌లోడ్ చేసే సమయానికి సర్వర్లు పనిచేయక దరఖాస్తు చేసుకునేందుకు మూడు, నాలుగుసార్లు సచివాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. కార్డులకు ఇన్ని నిబంధనలు ఉంటే ఎలాగంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

మ్యాపింగ్ తంటా..

రేషన్‌కార్డుకు వివాహమై పిల్లలు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలంటే భార్యాభర్తలు, పిల్లలు ఒకేచోట హౌస్ మ్యాపింగ్ ఉండాలి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్ల ద్వారా కుటుంబాల స్థితిగతులను తెలుసుకునేందుకు హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేశారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణకు దీనినే ప్రామాణికంగా నిర్దేశించింది. తల్లిదండ్రులు, వారి పిల్లలు ఒకే కుటుంబం అయినప్పటికీ మ్యాపింగ్‌లో ఒకేచోట లేకపోతే దరఖాస్తు స్వీకరణ సమయంలో ఆన్‌లైన్‌లో ఎర్రర్ చూపిస్తోంది. అప్పుడు వలంటీర్లు చేసిన తప్పిదాలు ఇప్పుడు రేషన్‌కార్డు దరఖాస్తుదారులకు శాపంగా మారాయి. మ్యాపింగ్‌లో మార్పులు, చేర్పులు, ఎడిట్ చేసే అవకాశాన్ని ఇవ్వకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఈ సమస్యను పరిష్కరించకపోతే కొత్త రేషన్‌కార్డు పొందే అవకాశాన్ని కోల్పోతారు.

(పిఠాపురం- ఆంధ్రజ్యోతి)

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులను స్వీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించిన ఆనందం ఆన్‌లైన్ కష్టాలతో ఆవిరైపోతోంది. దరఖాస్తులకు పెట్టిన నిబంధనలతో ప్రజలు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో తప్పులతడకగా ఉన్న హౌస్ మ్యాపింగ్‌ను ఇప్పుడు దరఖాస్తుల స్వీకరణకు ప్రామాణికంగా తీసుకోవడంతో పాట్లు తప్పట్లేదు. అందులో కుటుంబసభ్యుల మ్యాపింగ్ ఒకేచోట జరగకుంటే వారి దరఖాస్తులు ఆన్‌లైన్ కావట్లేదు. మ్యారేజ్ సర్టిఫికెట్‌ను తప్పనిసరి చేయడంతో అది ఎలా తెచ్చుకోవాలో తెలియక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇది తప్పనిసరి కాదని మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రకటించినా అది లేకుండా దరఖాస్తు తీసుకోకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. తాజాగా ఆశాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ సైతం ప్రకటించారు. ఇక బయోమెట్రిక్స్ పడకపోయినా దరఖాస్తు ఆన్‌లైన్ కావట్లేదు. ఓటీపీ ఆప్షన్ డిజేబుల్ చేయడంతో వేలిముద్రలు పడని వారు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఇదే స్థితి నెలకొంది.

- నూతన రేషన్‌కార్డులకు ఆన్‌లైన్‌లో అవస్థ
- మ్యాపింగ్ ఆధారంగానే దరఖాస్తుల స్వీకరణ
- నాటి హౌస్‌మ్యాపింగ్‌లో పలు లోపాలు
- కొత్త కార్డుల జారీకి అదే ప్రామాణికం
- మ్యారేజ్ సర్టిఫికెట్‌కు తంటాలు
- అవసరం లేదంటున్న మంత్రి నాదెండ్ల
- బయోమెట్రిక్స్ పడకుంటే నో ఛాన్స్
- ఓటీపీ ఆప్షన్ డిజేబుల్
- రేషన్‌కార్డు దరఖాస్తు ఉచితం
- రూ.100 వసూలు చేస్తున్న సిబ్బంది
- సచివాలయాల్లో దరఖాస్తులకు పాట్లు

నిబంధనలు సడలించాలి..

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ నిబంధన తొలగించడంతోపాటు ఆధార్ ఆధారంగానే దరఖాస్తుల స్వీకరణ ఉండాలని, మ్యారేజ్ సర్టిఫికెట్ నిబంధన తొలగించి వీఆర్వో లేదా సంబంధిత పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరణతో ఆన్‌లైన్ చేసే అవకాశం కల్పించాలని, బయోమెట్రిక్స్‌తోపాటు ఓటీపీ ఆప్షన్ ఇవ్వాలని, ఉమ్మడి కార్డులో ఉన్న ఎంతమందైనా విడిగా కార్డులకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించాలని పలువురు సూచిస్తున్నారు.

దరఖాస్తు చేయాలంటే రూ.100

రేషన్‌కార్డు దరఖాస్తు ప్రభుత్వం ఉచితమని ప్రకటించింది. అయితే సచివాలయ సిబ్బంది మాత్రం కార్డుకు రూ.100 వసూలు చేస్తున్నట్టు సమాచారం. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలోని ఒక సచివాలయంలో దరఖాస్తుదారుల నుంచి ఒక్కో కార్డుకు రూ.100 వసూలు చేస్తున్నట్టు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చాలాచోట్ల ఇదే పరిస్థితి ఉంది.

మ్యారేజ్ సర్టిఫికెట్ అక్కర్లేదు!

కొత్తగా కార్డు పొందడానికి మ్యారేజ్ సర్టిఫికెట్ తప్పనిసరి చేశారు. వివాహమైన వారిలో 95 శాతం మంది రిజిస్ట్రేషన్ చేసుకోరు. దీంతో ఇప్పుడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లి మ్యారేజ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇందుకు రూ.2,500 నుంచి రూ.5 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. అయితే మ్యారేజ్ సర్టిఫికెట్ అవసరం లేదని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం ప్రకటించారు.

బయోమెట్రిక్స్...

కార్డుల దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రక్రియలో ప్రధాన దరఖాస్తుదారుడు తప్పనిసరిగా తన బయోమెట్రిక్స్ (వేలిముద్రలు) వేయాల్సి ఉంటుంది. బయోమెట్రిక్స్ పడకుంటే దరఖాస్తు ఆన్‌లైన్ కావట్లేదు. గతంలో ఆధార్‌కు లింక్ అయిన మొబైల్‌కు ఓటీపీ వచ్చేది. దీని వల్ల బయోమెట్రిక్స్ పడనివారికి ఉపయోగకరంగా ఉండేది. ఓటీపీ ఆప్షన్ డిజేబుల్ చేశారని చెబుతున్నారు.

విభజనలో కొత్త కష్టాలు

తల్లిదండ్రులతో కలిసి ఉన్న కొడుకులు, కుమార్తెలకు వివాహమై కొత్త కార్డు పొందేందుకు విభజన అవకాశాన్ని కల్పించిన ప్రభుత్వం దానిని ఒక్కరికే పరిమితం చేసింది. ఇద్దరు పిల్లలు ఉండి, వారికి వివాహమైతే అందులో ఒక్కరినే విభజించే అవకాశం ఉండడంతో రెండో వారు దరఖాస్తు చేసుకునే వీల్లేకుండా పోతోంది.

- మ్యాపింగ్ సమయంలో భర్త వేరే ప్రాంతంలో ఉండడంతో పేరు కుటుంబంలో చేర్చకున్నా భార్యాపిల్లలకు కార్డు రావడం లేదు. భర్త లేకుండా విడిగా దరఖాస్తు చేసుకునే అవకాశం లేదు.

ఆధార్ చిరునామాతోనే...

- ఆధార్ కార్డులో ఉన్న చిరునామానే దరఖాస్తు స్వీకరణ సమయంలో పరిగణనలోకి తీసుకుంటున్నారు. చిరునామా మార్పునకు అవకాశం ఇవ్వకపోవడంతో పాత చిరునామాలతోనే దరఖాస్తు చేస్తున్నారు. వివాహమైన తర్వాత ఆధార్‌లో భార్య ఇంటి పేరు మారకున్నా, భార్యాభర్తల ఇంటి పేర్లు ఒకేలా లేకున్నా ఆన్‌లైన్‌లో తీసుకోవట్లేదు. చదువుకున్న వారు ఉద్యోగాల కోసం ఆధార్‌లో ఇంటి పేరు మార్చుకోవడం లేదు. అటువంటి వారికి ఇబ్బంది ఎదురవుతోంది.
- చిన్నారుల బాల ఆధార్ అప్‌డేట్ అయితే కానీ వారి పేర్లను తల్లిదండ్రుల కార్డుల్లో చేర్చడానికి అవకాశం ఉండట్లేదు. ఇప్పుడు అప్‌డేట్ చేయించాలంటే కార్డుల దరఖాస్తు గడువు ముగిసిపోతుందని చెబుతున్నారు. దీంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గడువు ఇవ్వాలని కోరుతున్నారు.



కాకినాడ నగరంలోని జడ్పీ సెంటర్‌లో జోరున కురుస్తున్న వాన

భారీ వర్షం

- జిల్లాలో ఉరుములు, మెరుపులతో కురిసిన వాన
- పలుచోట్ల భారీగా..
- స్తంభించిన జనజీవనం
- ఉదయం ఎండ, సాయంత్రం వాన

కాకినాడ, మే 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ వేడి, ఉక్కపోతతో ఉన్న వాతావరణంతో ప్రజలు అల్లాడిపోయారు. ఇంటి నుంచి బయటకు వచ్చేందుకే బెంబేలెత్తిపోయారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి వాతావరణం పూర్తిగా మేఘావృతమైంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు బలంగా వీచాయి. రెండు గంటలపాటు కురిసిన ఈ వర్షానికి జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వారంరోజులుగా విపరీతమైన వేడి మధ్య అలసిన జనం గురువారం కురిసిన వానతో సేదతీరారు. ఏకధాటిగా కురిసిన వర్షంతో కాకినాడ నగరంతోపాటు జిల్లాలోని పిఠాపురం, సామర్ల కోట, కొత్తపల్లి, ప్రత్తిపాడు, కిర్లంపూడి, జగ్గంపేట, తుని తదితర మండలాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల చెట్లు కూలాయి. విద్యుత్‌తీగలు తెగిపడి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పిఠాపురం, గొల్లప్రోలుల్లో కళ్లాల్లోని ధాన్యం బస్తాలు తడిచిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ నగరంలోని మెయిన్ రోడ్డు, సినిమా రోడ్డు, చిన్నమార్కెట్, పెద్దమార్కెట్‌తోపాటు రూరల్‌లోని పలు గ్రామాల్లో వర్షపునీరు నిలిచింది.



గొల్లప్రోలులో ధాన్యం బస్తాల్లోకి చేరిన వర్షపునీరు

తాళ్లూరు లిఫ్ట్ మరమ్మతులకు నిధులివ్వండి

- సీఎం చంద్రబాబును కోరిన ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, మే 15(ఆంధ్రజ్యోతి): పుష్కర ఎత్తిపోతల పథకంలో భాగమైన తాళ్లూరు లిఫ్ట్ మరమ్మతులు చేసేందుకు రూ.5.2కోట్ల నిధులు కేటాయించాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సీఎం చంద్రబాబును కోరారు. ఈ మేరకు అమరావతిలోని సచివాలయంలో సీఎంను గురువారం ఆయన కలిశారు. తాళ్లూరు లిఫ్ట్ పనులను హ్యామ్స్ పద్ధతిలో చేయించేందుకు అధికారులను సీఎం ఆదేశించినట్టు ఎమ్మెల్యే నెహ్రూ తెలిపారు.



సీఎం చంద్రబాబుకు వివరాలు తెలుపుతున్న నెహ్రూ

వైద్యఆరోగ్యశాఖలో ఫ్రంట్ రన్నర్ జిల్లాగా కాకినాడ



జీజీహెచ్(కాకినాడ), మే 15 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖలో ఎక్కువ ఆరోగ్యకార్యక్రమాలను పటిష్ఠంగా నిర్వహించి ప్రతిభ కనబరిచిన ఫ్రంట్ రన్నర్ జిల్లాగా ఎంపికైనట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆరోగ్య కార్యక్రమాలు అమలుతోపాటు 12 అంశాలను పెర్ఫార్మెన్స్ మాట్రిక్స్ సూచికలుగా పరిగణించి ప్రతి ఇండికేటరీ వారీగా మార్కులు కేటాయించగా 100 పాయింట్స్‌కి కాకినాడ జిల్లా 80.08శాతం మార్కులతో పదో స్థానంలో నిలిచినట్లు ఆయన పేర్కొన్నారు.

టాప్ టెన్‌లో.. 6

- ఉమ్మడి జిల్లాలో వైద్యఆరోగ్య శాఖకు ఉత్తమ ర్యాంకులు
- రాష్ట్రస్థాయిలో కాకినాడ జిల్లాకు పదో స్థానం

మూడో శనివారాన్ని బీట్‌దిహీట్ థీమ్‌తో నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), మే 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈనెల మూడో శనివారం స్వచ్ఛాంధ్ర స్వచ్ఛదివాస్ కార్యక్రమాన్ని బీట్‌దిహీట్ థీమ్‌తో నిర్వహించాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం తీవ్ర ఉష్ణోగ్రతలు, హ్యూమిడ్ వాతావరణంతో నెలకొన్న ప్రతికూల పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం సూచించిన వివిధ అంశాలతో ఈ శనివారాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దీనిలోభాగంగా వడగాల్పులు, తీవ్ర ఉష్ణోగ్రతలకు సంబంధించి వాతావరణశాఖ జారీ చేసే సూచనలు, హెచ్చరికలపై ముందుగానే ప్రజలకు సమాచారం అందించి అప్రమత్తం చేయాలన్నారు. పబ్లిక్ ప్రదేశాల్లో తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. పట్టణాల్లో ఖాళీప్రాంతాల్లో మొక్కలు నాటి అర్బన్ ఫారెస్ట్‌లను అభివృద్ధి చేయాలన్నారు. రోడ్ మార్జిన్ల వెంబడి నీడనిచ్చే చెట్లను పెంచాలన్నారు. ప్రజలు ఇంటి మిద్దెలపై మొక్కలు నాటి రూఫ్ టాప్‌లను అభివృద్ధి చేయాలన్నారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నప్పుడు పిల్లలు, వృద్ధులు ఇంటినుంచి బయటకు రావద్దన్నారు. రెన్యూవబుల్ ఎనర్జీ, గ్రీన్ బిల్డింగ్స్ అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 17న శనివారం ఈ స్వచ్ఛతా దివాస్ కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో అధికారులు విజయవంతం చేయాలని డీఆర్‌వో సూచించారు.

జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగవంతం

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), మే 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపట్టిన వివిధ జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో గురువారం ఆయన నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, రెవెన్యూ, సర్వే, ఏపీఈపీడీసీఎల్, పోలవరం ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారి 216 కాకినాడ-కత్తిపూడి, కాకినాడ పోర్టు-అచ్చంపేట, అచ్చంపేట-సామర్లకోట, వాకలపూడి-అన్నవరం వరకు నిర్మించనున్న పనుల పురోగతిపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం జాతీయ రహదారుల నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందన్నారు. రెవెన్యూ, ఎన్‌హెచ్‌ఏఐ ఇంజినీరింగ్ అధికారులు, సర్వే, విద్యుత్‌శాఖల అధికారుల సమన్వయంతో నిర్దేశించిన గడువులోపు నిర్మాణపనులు పూర్తిచేయాలని ఆదేశించారు. జాతీయ రహదారులకు అవసరమైన భూసేకరణ పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎన్‌హెచ్‌ఏఐ పీడీ సురేంద్ర, ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ ప్రసాద్ పాల్గొన్నారు.

సామర్లకోట చైర్‌పర్సన్ పదవికి రాజీనామా

- అవిశ్వాస తీర్మాన సమావేశానికి 25 మంది వైసీపీ కౌన్సిలర్లు హాజరు 7

తగ్గని.. 'స్థల'పోటు..



భూదాన భూమిలో డంప్ చేసిన ఇసుక, ఇన్‌సెట్‌లో రెవెన్యూశాఖ హెచ్చరిక బోర్డు

- మరోసారి తెరపైకి భూదాన బోర్డు భూ వ్యవహారం
- ఇసుక స్టాక్ పాయింట్‌కు కేటాయించిన గనులశాఖ
- కోర్టు పరిధిలో ఉన్న భూమిని ఎలా ఇస్తారని పట్టాదారుల ఆందోళన

కొంతకాలంగా కాకినాడ నగరంలో నలుగుతోన్న భూదాన బోర్డు భూ వివాదం మరోసారి రాజుకుంది. పట్టాదారులు హైకోర్టును ఆశ్రయించి స్టేటస్‌కో తెచ్చుకున్న ఈ భూమిని ఇసుక ర్యాంపు నిర్వహణకు లీజుకి ఇవ్వడంపై తాజాగా వివాదం మొదలైంది. గురువారం ఆ స్థలంలో ఇసుకను నిల్వ చేయడాన్ని పట్టాదారులు అడ్డుకుని ఆందోళనకు దిగారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ ప్రభుత్వ ఐటీఐ వెనుక సర్వే నెంబర్ 144/1, 144/3లలో భూదాన బోర్డుకు సంబంధించి 4.7ఎకరాలభూమి ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతల కళ్లు పడ్డాయి. కోట్లాది రూపాయల విలువైన ఈ భూమిని కొట్టేసేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. అప్పటి ఎమ్మెల్యే ఆ భూములను ఆయన అనుకూల కార్పొరేటర్లకు అప్పనంగా అప్పగించేందుకు ప్రయత్నించారు. ఈ భూమి ని భూదాన బోర్డుది అని పేర్కొంటూ ఆంధ్రప్రదేశ్ భూదాన బోర్డు 2014, జనవరి 20న ధ్రువీకరించి పేదలకు పట్టాలు ఇచ్చేందుకు తీర్మానం చేసిందని కొందరు పత్రాలతో రోడ్డెక్కారు. ఇక్కడ తమకు స్థలాలు కేటాయించాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ భూమిపై ఓ వైపు న్యాయపరమైన చిక్కులు ఉండగానే.. తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించుకోవడానికి ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి.

గనులశాఖ ఉత్తర్వులతో వివాదం

తాజాగా గతేడాది రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ భూమిని ఇసుక ర్యాంపు నిర్వహణకు కేటాయిస్తూ గనులశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో మరోసారి వివాదం మొదలైంది. రెండేళ్లపాటు ఈ భూమిని లీజు ప్రాతిపదికన వినియోగించుకునేలా, ఇసుకను నిల్వచేసుకునేలా ఈ నెల ఏడో తేదీన తేజా ఇన్‌ఫ్రాటెక్ ప్రైవేటు లిమిటెడ్‌కు లీజుకు ఇస్తూ గనులశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఆ భూమిని చదును చేసే పనులు కొన్నిరోజులుగా సాగుతున్నాయి. భూదాన భూమిలో ఎలాంటి కార్యకలాపాలు సాగించవద్దని, అందులో తాము పట్టాలు పొందామని కొంతమంది లబ్ధిదారులు గత సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. భూమిని యథాస్థితిలో ఉంచాలని, రాష్ట్ర హైకోర్టు స్టేటస్‌కో విధించినా, అధికారులు భూమి చదును చేస్తున్నారన్నారు. ఇక్కడ ఇసుకయార్డు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారని, ప్రైవేటువ్యక్తికి రెండేళ్లపాటు లీజుకు ఇవ్వడానికి పూనుకొంటున్నారని తెలిపారు.

మరోసారి వివాదం

గురువారం ఏకంగా ఇసుకను డంప్ చేయడంతో మరోసారి వివాదం మొదలైంది. విషయం తెలుసుకున్న స్థలలబ్ధిదారులు కొందరు ఇసుక డంపింగ్‌ను అడ్డుకున్నారు. 'తమకు స్థలాలుగా కేటాయించిన భూముల్లోఇసుక వేయడానికి మీరెవరు' అంటూ ప్రశ్నించారు. 'ఇసుక వేసేందుకు మీకున్న అనుమతులేవీ' అని ప్రశ్నించడంతో ఇసుకను డంపింగ్ చేస్తున్న వారు అక్కడినుంచి వెళ్లిపోయారు. హైకోర్టులో కేసు నడుస్తోన్న ఈ భూమిలో ఇసుకర్యాంపుల నిర్వహణకు ఇవ్వడంపై లబ్ధిదారులు ఆందోళనవ్యక్తం చేస్తున్నారు. హైకోర్టు తీర్పును ధిక్కరించి పేదలస్థలంలో ర్యాంపులకు అనుమతి ఇవ్వడమేంటని మాజీ ఎంపీటీసీ అనిల్ ప్రశ్నించారు.

19 నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

- జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు



కలెక్టరేట్ (కాకినాడ), మే 15 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19 నుంచి 28 వరకు పదో తరగతి సప్లిమెంటరీ పబ్లిక్ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లుచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు ఆదేశించారు. ప్రభుత్వపాఠశాలల్లో పదోతరగతి చదివిన విద్యార్థులకు, ఏపీ సార్వత్రిక విద్యాపీఠం విద్యార్థులకు, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లో గురువారం ఆయన సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా 29 కేంద్రాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరిగే పరీక్షలకు 5,956మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. ప్రశ్నపత్రాల స్టోరేజ్ నిమిత్తం 18 పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 19 నుంచి 24 వరకు ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో పదో తరగతి(ఓపెన్ ఎస్ఎస్‌సీ), ఓపెన్ ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. రెగ్యులర్ పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలతోపాటు ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ పరీక్షలను ఉదయం పూట నిర్వహిస్తామన్నారు. ఓపెన్ ఇంటర్ పరీక్షలకు సంబంధించి జిల్లాలో 1,151మంది విద్యార్థులకు నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అన్ని కేంద్రాల్లో ఫర్నీచర్, తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సులు నడపాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాలవద్ద వైద్య శిబిరాలు ఏర్పాటుతోపాటు పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని సూచించారు. సమావేశంలో డీఈవో పి.రమేష్, పోస్టల్ పీఆర్‌ఐపీ ప్రసాద్‌రావు, డీసీఈబీ కార్యదర్శి వెంకట్రావు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో మాక్ డ్రిల్

- విపత్తులను ఎదుర్కోవడంపై అవగాహన: డీఆర్‌వో

కలెక్టరేట్(కాకినాడ),మే15(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు, భవనాలు కూలడం వంటి విపత్తులు సంభవించినప్పుడు సమర్థంగా ఎదుర్కోవడం ఎలా అనే అంశంపై శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు తెలిపారు. కాకినాడ కలెక్టరేట్‌లో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకస్మికంగా భవనాలు కుప్పకూలడం, అగ్నిప్రమాదాలు, ఏసీలు, ఫ్రిజ్‌లవల్ల ప్రమాదాలు జరిగితే సివిల్ డిఫెన్స్ ప్రిపేర్డ్‌నెస్ వ్యవస్థల ద్వారా పౌరరక్షణకు తక్షణం స్పందించేలా జిల్లా ఎమర్జెన్సీ ఆపరేషన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ మాక్‌డ్రిల్‌లో ఒక సీన్ క్రియేట్ చేసి సహజంగా జరిగిన సంఘటనలో అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు ఏ విధంగా సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటాయో కళ్లకు కట్టినట్లు చూపిస్తారన్నారు. డీఈఓసీ నోడల్ అధికారి భారతి, అసిస్టెంట్ జిల్లా అగ్నిమాపక అధికారి సుబ్బారావు, డీపీవో రవికుమార్, డీటీసీ శ్రీధర్ పాల్గొన్నారు.

ఈసెట్-2025 ఫలితాల్లో 95.08 శాతం ఉత్తీర్ణత

కాకినాడ రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి): ఈనెల 6న అనంతపురం జేఎన్టీయూకే ఆధ్వర్యంలో నిర్వహించిన ఈసెట్-2025 ప్రవేశపరీక్ష ఫలితాలను గురువారం విడుదలచేశారు. జిల్లాలో 95.08శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ పరీక్షకు జిల్లాలో మొత్తం 1,809మంది హాజరుకాగా 1,720మంది ఉత్తీర్ణులయ్యారు. బాలుర విభాగంలో 1160మంది, బాలికల విభాగంలో 560మంది ఉత్తీర్ణత సాధించారు.

- కావ్యశ్రీకి రెండో ర్యాంకు

ఈసెట్ ఫలితాల్లో ఫార్మసీ విభాగంలో కాకినాడ జిల్లా సామర్లకోట మండలం మాధవపట్నం గ్రామానికి చెందిన వాసంశెట్టి కావ్యశ్రీ 113 మార్కులతో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించింది.

కాకినాడలో కంటైనర్ ఫ్రైట్ స్టేషన్ 6



ప్రజారోగ్యానికి దోమలే ప్రథమ శత్రువు

» సగం అనారోగ్య సమస్యలకు ఇవే మూలం » పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే డెంగ్యూ దూరం
» గడిచిన పదేళ్లలో డెంగ్యూ వ్యాధి తగ్గుముఖం » వ్యాధి నిర్ధారణ కేంద్రాలు మరిన్ని అవసరం
» మాక్-ఎలీసాదే తుది నిర్ధారణ పరీక్ష » నేడు జాతీయ డెంగ్యూ అవగాహన దినం

(పి.గన్నవరం-ఆంధ్రజ్యోతి)

'పరిశీలించండి...శుభ్రం చేయండి...మూతలు పెట్టండి అనే మూడు పద్ధతుల ద్వారా డెంగ్యూను పూర్తిగా ఓడించండి' ఇదీ వైద్య ఆరోగ్యశాఖ నినాదం. ఎందుకంటే దోమలు ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులుగా భావించవచ్చు. దోమల ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికన్ గున్యా, మొదడువాపు, జికా వంటి ప్రధాన వ్యాధులు వ్యాపిస్తాయి. అయితే ప్రజల్లో డెంగ్యూ వ్యాధి గురించి ప్రత్యేక అవగహన కార్యక్రమాలు, నివారణ చర్యలపై దృష్టిపెట్టడం వంటి ప్రధాన లక్ష్యంతో గత పదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం డెంగ్యూ వ్యాధిని తగ్గించడంలో గణనీయమైన ప్రగతిని సాధించిందని చెప్పవచ్చు. ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవడంతో డెంగ్యూ లక్షణాలు ఉన్నప్పటికీ తీవ్రత అంతగా ఉండడం లేదని వ్యాధి త్వరితగతిన అదుపులోకి వస్తోందని వైద్యాధికారులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కర్నూలు, నంద్యాల, విశాఖపట్నం, తిరుపతి, కాకినాడ జిల్లాల్లో మాత్రమే డెంగ్యూ కేసులు అధికంగా నమోదవుతున్నాయని అధికారికంగా ప్రభుత్వం ప్రకటించింది. ఇంటి చుట్టుపక్కల దోమలు ఉత్పత్తి అయ్యే నీటి నిల్వలు ఉన్నాయేమో చూడడంతోపాటు నీటి నిల్వలను శుభ్రం చేసి నీరు నిల్వ ఉండే తొట్లెలు, డబ్బాలు వంటి వాటిపై మూతలు ఉంచితే దోమలు వ్యాపించవు. తద్వారా డెంగ్యూ వ్యాధిని నివారించవచ్చు. ఇక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా 2023లో 84 డెంగ్యూ కేసులు నమోదుకాగా, 2024లో అత్యధికంగా 239 డెంగ్యూలు కేసులు నమోదయ్యాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ ఏడాది జనవరి నెల నుంచి ఇప్పటివరకు 11 కేసులు మాత్రమే నమోదయ్యాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. అయితే ప్రైవేటు ఆసుపత్రుల్లో చేసిన పరీక్షలు పరిగణనలోకి తీసుకోబోమని, ఆ పరీక్షలతో డెంగ్యూ నిర్ధారణ కాదని మాక్-ఎలీసా పరీక్షే డెంగ్యూ నిర్ధారణగా భావించవచ్చని ఆరోగ్యశాఖ స్పష్టం చేస్తోంది.

డెంగ్యూ వ్యాధి లక్షణాలు..

డెంగ్యూను పరిశీలిస్తే.. సాధారణంగా మన ఇళ్ల పరిసరాల్లో అనాఫిలస్, క్యూలెక్స్, ఏడిస్, మాన్సోనియా అర్మిజరిస్ దోమలు పెరుగుతాయి. డెంగ్యూ అనేది వైరల్ జ్వరం, ఇది ఏడిస్ అనే దోమకాటు వల్ల వ్యాపిస్తుంది. ఈ ఏడిస్ దోమ ముఖ్యంగా పగటిపూట కుట్టే దోమ. ఒక్కసారిగా అధిక జ్వరం, తలనొప్పి, కంటివెనుక భాగంలో నొప్పి, కండరాలు నొప్పులు, జుట్టు ఊడిపోవడం, చర్మంపై గుండ్రటి ఎర్రమచ్చల లక్షణాలు కనిపిస్తాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం సెంటినల్‌సైట్ హాస్పటల్, రామచంద్రాపురం ఏరియా ఆసుపత్రుల్లో మాత్రమే డెంగ్యూ నిర్ధారణ పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. అలాగే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈ రెండిటితోపాటు కాకినాడ, రాజమహేంద్రవరం ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రులు (జీజీహెచ్‌లు), తుని ఏరియా ఆసుపత్రిల్లో డెంగ్యూ నిర్ధారణ కేంద్రాలు ఉన్నాయి. రోగి రక్త నమూనాలను మొదట ఎన్ఎస్-1 కిట్ ద్వారా పరీక్ష నిర్వహిస్తారు. వ్యాధి జాడలు కనిపిస్తే నిర్ధారణ కోసం మాక్-ఎలీసా పరీక్ష నిర్వహించి వ్యాధిని నిర్ధారిస్తారు. అయితే ప్రైవేటు ల్యాబ్‌ల్లో నిర్వహించే పరీక్షలు మాత్రం డెంగ్యూ నిర్ధారణ కాదని జిల్లా వైద్యాధికారులు స్పష్టం చేస్తున్నారు. ఒకవేళ ప్రైవేటు ఆసుపత్రుల్లో డెంగ్యూ సూచనలు కనిపిస్తే డీఎంఅండ్‌హెచ్‌వో, డీఎంవో స్థాయి అధికారుల పర్యవేక్షణలో నిర్ధారణ చెయ్యవల్సిందే.



పి.గన్నవరం మండలంలో చేస్తున్న జ్వర సర్వే

డ్రైడే ఫ్రైడేతో మంచి ఫలితాలు

ప్రతి శుక్రవారం గ్రామాల్లో నిర్వహించే డ్రై డే‌ఫ్రైడే కార్యక్రమం మంచి ఫలితాలిస్తోంది. గ్రామస్థాయిలో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు. అలాగే సీజనల్ వ్యాధులపై ఎప్పటికప్పుడు జ్వర సర్వేలను నిర్వహించి తగు సూచనలు చేస్తున్నాం. అలాగే పరిశీలన, శుభ్రంచేయడం, మూతలు పెట్టడం ద్వారా దోమలు నివారించవచ్చు. జిల్లాలో ఇప్పటివరకు 11 డెంగ్యూ కేసులు మాత్రమే నమోదయ్యాయి. **- నక్కా వెంకటేశ్వరావు, జిల్లా మలేరియా అధికారి**

దోమల నివారణకు చర్యలు..

- ఇంటి పరిసరాల్లో నీరు నిలవకుండా చూసుకోవాలి.
- నీరు నిలువ చేయడం తప్పనిసరి అయితే అందులో వారానికి ఒకసారి కిరోసిన్ ఆయిల్ లేక వాడిన ఇంజన్ ఆయిల్ చల్లితే దోమలు వ్యాప్తి చెందవు.
- ఇంటి పరిసరాల్లో పనికిరాని తొట్లు, డబ్బాలు, టైర్లు, కొబ్బరి చిప్పలు వంటి వస్తువులు ఉండకుండా చూసుకోవాలి.
- గంబుషియా, గప్పి అనే చిన్న చిన్న చేపలను బావులు, కుంటలు వంటి వాటిలో వదిలితే నీటిలో ఉన్న దోమ లార్వాలను ఈ చేపలు తిని బతుకుతాయి. తద్వారా దోమలు పుట్టుక ఉండదు.
- ఇంటి పైకప్పులో ఉన్న ట్యాంకులకు మూతలు అమర్చాలి. లేకపోతే గుడ్లు పెట్టి పెరుగుతాయి.

దోమకాటు నుంచి రక్షణ కోసం..

- దోమకాటు నుంచి రక్షణకు దోమతెరలు వాడాలి.
- ఇంటి కిటికీలకు మెస్ అమర్చాలి.
- పొడవాటి దుస్తులను ధరించాలి. దోమలను చంపే క్రీములు, స్ప్రేలు వాడాలి. ఇళ్లల్లో క్రిమిసంహారక మందులను పిచికారి చెయ్యాలి.

టాప్ టెన్‌లో..

2, 7, 10.. ఇవీ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖలకు కేటాయించిన ర్యాంకులు. వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ ఈ ర్యాంకులను ప్రకటించింది. ఇందులో టాప్ టెన్‌లో తూర్పుగోదావరి రెండో స్థానంలో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏడో స్థానంలో, కాకినాడ జిల్లా పదో స్థానంలో నిలిచాయి.

» ఉమ్మడి జిల్లాలోని వైద్య, ఆరోగ్యశాఖలకు ఉత్తమ ర్యాంకులు
» రాష్ట్రస్థాయిలో తూర్పు గోదావరికి రెండో స్థానం
» ఏడు, పది స్థానాల్లో నిలిచిన కోనసీమ, కాకినాడ జిల్లాలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు, మాతా-శిశు ఆరోగ్యం తదితర 11అంశాల్లో రాష్ట్రంలో కాకినాడ జిల్లా పదో స్థానంలో నిలిచింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ రెండు రోజుల క్రితం ర్యాంకులు వెల్లడించింది. 2024-25 సంవత్సరానికి సంబంధించిన సమాచారం ఆధారంగా వీటిని కేటాయించారు. మొత్తం వంద మార్కులకు కాకినాడ జిల్లాకు 80.08, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు 81.32, తూర్పుగోదావరి జిల్లాకు 82.63 వచ్చాయి. రాష్ట్రంలో తూర్పుగోదావరి జిల్లా రెండు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏడు, కాకినాడ జిల్లా పది స్థానాల్లో నిలిచాయి.

మార్కులు ఇలా..

మొత్తం 12 అంశాలను పరిగణలోకి తీసుకుని మార్కులువేశారు. ఒక్కో అంశానికి పది మార్కులు, మరికొన్ని అంశాలకు ఐదేసి మార్కుల చొప్పున ఈ ర్యాంకులను కేటాయించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరుకు మొత్తం పది మార్కులు కేటాయించగా కాకినాడజిల్లాకు 6.93 మార్కులు వచ్చాయి. 3.07 మార్కులు తగ్గాయి. వీటి పనితీరు కాస్త పర్వాలేదనిపిస్తోంది. మాతా-శిశుఆరోగ్యానికి 25 మార్కులకు కాకినాడ జిల్లాకు 21.89, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు 21.88, తూర్పుగోదావరిజిల్లాకు 22.56 వచ్చాయి. ఎన్‌యూహెచ్‌ఎం, వ్యాధుల నియంత్రణ, డీసీహెచ్‌ఎస్‌కు 25 మార్కులకు కాకినాడ జిల్లాకు 24.10, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు 22.58, తూర్పుగోదావరి జిల్లాకు 22.22 వచ్చాయి. కుటుంబనియంత్రణ, ఆరోగ్యసముదాయానికి సంబంధించి ఐదు మార్కులకు కేవలం 1.86 మార్కులే కాకినాడ జిల్లాకు వచ్చాయి. ఈ విషయంలో వెనుకబడే ఉంది. ఎచ్‌డబ్ల్యూసీకి సంబంధించి మొత్తంపది మార్కులకు కాకినాడ జిల్లాకు 9.8, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు 9.83, తూర్పుగోదావరి జిల్లాకు 9.97 వచ్చాయి. ఆభ, ఎఫ్ఆర్ఎస్‌కు సంబంధించి మొత్తం ఆరు మార్కులకు కాకినాడ జిల్లాకు 5.08, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు 5.08, తూర్పుగోదావరి జిల్లాకు 5.12 వచ్చాయి.

ర్యాంకింగ్ సంతృప్తికరమే..



రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ విడుదల చేసిన ర్యాంకింగ్‌లో టాప్ టెన్‌లో నిలవడం సంతృప్తినిచ్చింది. మొత్తం మూడు కేటగిరీల్లో ఈ ర్యాంకులను ప్రకటించారు. ప్రస్తుతం గుడ్ పెర్ఫార్మెన్స్ కేటగిరీలోనే కాకినాడజిల్లా ఉంది. కేవలంరెండు, మూడు మార్కుల తేడాలోనే ర్యాంకులు మారాయి. మన జిల్లాకు సంబంధించి కుటుంబ నియంత్రణ, కౌమార బాలిక ఆరోగ్యానికి సంబంధించి ఐదుమార్కులకు 1.86, క్వాలిటీ ఎస్యూరెన్స్‌కు సంబంధించి నాలుగు మార్కులకు 1.20 వచ్చాయి.

-డాక్టర్ జె.నరసింహనాయక్, డీఎంహెచ్‌వో, కాకినాడ జిల్లా

డెల్టా రూపశిల్పి కాటన్ దొరకు ఘన నివాళి



కాటన్ దొరకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఇరిగేషన్ అధికారులు

ధవళేశ్వరం, మే 15 (ఆంధ్రజ్యోతి): డెల్టా రూపశిల్పి, గోదావరి జిల్లాలను ఆంధ్ర అన్నపూర్ణగా మార్చిన సర్ అర్థర్ కాటన్ 222వ జయంతిని ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం కాటన్ బ్యారేజ్ ముఖద్వారం వద్ద ఉన్న కాటన్‌దొర విగ్రహానికి డెల్టా చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీరామకృష్ణ, ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ కె.గోపీనాథ్, ఇతర సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఈ ఆనంద్‌బాబు, ఏఈలు అద్దంకి సాయిరాం, రాధాకృష్ణ, సునీల్ పాల్గొన్నారు.

- ధవళేశ్వరంలోని కాటన్ స్మృతి వనంలో కాటన్‌దొర విగ్రహానికి డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు ప్రజలు గుండెల్లో ఆయన చిరస్మరణీయుడుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో గరగ శ్రీనివాసరావు, మోర్త పావనమూర్తి, శ్రీరంగంబాలరాజు, పులపర్తి కిషోర్ పాల్గొన్నారు.

ఘనంగా 222వ జయంతి వేడుకలు

- గోదావరి నదిపై ఆనకట్ట కట్టి అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన కాటన్‌దొర ఆంధ్రుల పాలిట అన్నదాత అయ్యారని కూటమి నాయకులు కొనియాడారు. కాటన్ స్మృతి వనంలోని కాటన్ దొర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పందిరి అప్పారావు, యడ్లమహేష్, నీలి కోటేశ్వరరావు, బీరా ప్రకాష్, రెహ్మాన్‌ఖాన్, దారపు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- కాటన్ దొర జయంతిని పురస్కరించుకుని బీఎస్ కెమికల్స్ అధినేత బీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కపిలేశ్వరపురానికి చెందిన ఈయన నాలుగేళ్లుగా కాటన్‌పై అభిమానంతో ఏర్పాటుచేస్తున్నారు.

మన్యంలో చైల్డ్ ఆర్టిస్ట్ భానుప్రకాష్ సందడి

మోతుగూడెం, మే 15 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో చైల్డ్ ఆర్టిస్ట్ భానుప్రకాష్ సందడి చేశాడు. పర్యాటక ప్రదేశాలైన ధారాలమ్మగుడి పిక్నిక్ స్పాట్, పొల్లూరు జలపాతం, పుష్ప షూటింగ్, బ్రిడ్జి ఫోర్‌బై రిజర్వాయర్ వద్ద పర్యటించి సందడి చేశాడు. ఈ సందర్భంగా భానుప్రకాష్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.... తాను తండేల్, కింగ్డమ్, హరికథ, కేజీఎఫ్-2, యక్షిణి, గమనం, విమానం, అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్, లవ్‌స్టోరీ, సరిలేరు నీకెవ్వరు, వెంకీమామ, కథానాయకుడు, మిస్టర్ మజ్ను, ఒకక్షణం వంటి 60 సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించానని, అందులో కొన్ని ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చాయని తెలిపాడు. సినిమాల్లోనే కాకుండా టీవీ షోలు, సీరియళ్లు, నాటకాలు వంటి ఇతర రంగాల్లోను నటనతో రాణిస్తూ గుర్తింపు తెచ్చుకుంటున్నాడు. తన తండ్రి సురేష్ కూడా సినిమా రంగానికి చెందిన వాడేనని, ఆయన 30కిపైగా లఘు చిత్రాల్లో చేశాడని తెలిపాడు. తాను హార్ట్‌బీట్ అనే ఇండిపెండెంట్ సినిమా కూడా చేశానని తెలిపాడు.



భానుప్రకాష్



సీ పోర్టు సమీపంలో కంటైనర్ కేంద్రాన్ని ప్రారంభించిన కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్

కాకినాడలో కంటైనర్ ఫ్రైట్ స్టేషన్

» కార్గోల ఎగుమతి, దిగుమతులకు అందుబాటులోకి కేంద్రం » ప్రారంభించిన కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్

కాకినాడ సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు వివిధ రకాల కార్గోల ఎగుమతి, దిగుమతులకు కంటైనర్ కేంద్రం అందుబాటులోకి వచ్చింది. కంటైనర్ ఫ్రైట్ స్టేషన్‌ను కాకినాడ కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ కె.రవికుమార్ గురువారం ప్రారంభించగా కాకినాడ సీ పోర్టు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మురళీధర్, శ్రావణ్ గ్రూప్ ఎండీ జి.సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటైన ఈ కంటైనర్ ఫ్రైట్ స్టేషన్‌తో కాకినాడ పారిశ్రామికంగా మరింత ఎదగనుందన్నారు. ప్రస్తుతం ఇటువంటి కంటైనర్ ఫ్రైట్ స్టేషన్లు విశాఖలో పది ఉన్నాయన్నారు. కాకినాడలో షిప్పింగ్ ఆధారిత వ్యాపారం మరింత పుంజుకోనుందని తెలిపారు. వ్యాపారులు కంటైనర్ ఎగుమతుల కోసం చెన్నై, విశాఖ వెళ్లక్కర్లేకుండా ఇక్కడి నుంచే విదేశాలకు ఎగుమతులు చేయవచ్చని వివరించారు. ఈ కేంద్రం ఆక్వా, ఫార్మా, రైస్, రా షుగర్ దిగుమతికి ఉపయోగపడుతుందన్నారు.

కాకినాడ సీ పోర్టు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మురళీధర్ మాట్లాడుతూ ఎగుమతుదారులకు సరైన సదుపాయాలు లేక కాకినాడలో కంటైనర్ వ్యాపారం చాలా తక్కువగా జరుగుతోందన్నారు. ఈ కేంద్రం రాకతో అన్ని షిప్పింగ్ కంపెనీలు త్వరలో కార్యకలాపాలు మొదలుపెడతాయన్నారు. ఫ్రైట్ స్టేషన్ ఏర్పాటుకు మొదట్లో చాలా పెట్టుబడి పెట్టాల్సి ఉంటుందన్నారు. పోర్టు, కస్టమ్స్, ఫ్రైట్ స్టేషన్ కలిసి కాకినాడ పారిశ్రామికంగా అభివృద్ధి చెందేలా తోడ్పాటు అందిస్తామన్నారు. ప్రధానంగా బియ్యం ఎగుమతులకు కంటైనర్లు చాలా ఉపయోగమన్నారు.

శ్రావణ్ గ్రూప్ ఎండీ సాంబశివరావు మాట్లాడుతూ కాకినాడలో తాము ఏర్పాటుచేసిన కంటైనర్ కేంద్రం ఎగుమతులకు ఎంతోగానే కలిసివస్తుందన్నారు. పది ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా ఒకేసారి మూడువేల కంటైనర్లను హ్యాండిల్ చేయవచ్చన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో 2004లో తమ సంస్థ తొలి సీఎఫ్ఎస్ ఏర్పాటు చేసిందన్నారు. ఆ తర్వాత మరొకటి ఏర్పాటు చేయగా మూడోది కాకినాడలో ఏర్పాటు చేశామని వివరించారు. కార్యక్రమంలో కస్టమ్స్ అధికారులు, షిప్పింగ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



కాకినాడ జిల్లా కొత్తపల్లిలో...

వికసించిన 'మే' పుష్పాలు

కొత్తపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లికి చెందిన కాకరపల్లి గంగాధర శ్రీనివాసరావు ఇంటి ప్రాంగణంలో 'మే' పుష్పాలు వికసించాయి. గతంలో ఒకటి లేక రెండు పూసేవని, ఈసారి ఏకంగా నాలుగు వికసించాయని చెప్పారు.

కాట్రేనికోన (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన యాదవుల వీధిలో మట్టపర్తి అనంతలక్ష్మి ఇంటి పెరట్లో మూడు మే పుష్పాలు వికసించాయి. 15 ఏళ్ల నుంచి పూలు పూస్తున్నట్టు ఆమె చెప్పారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోనలో...



తల్లిదండ్రులు సుహాన్‌బీబీ, యాకూబ్‌లతో అబ్దుల్ రజాక్

పేదింట విరిసిన విద్యా కుసుమం

ఏపీ ఈసెట్ కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో అబ్దుల్ రజాక్‌కు రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు

రామచంద్రపురం (ద్రాక్షారామ), మే 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణానికి చెందిన అబ్దుల్ రజాక్ ఏపీ ఈసెట్‌లో కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో 121 మార్కులతో రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు సాధించాడు. రజాక్ ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు స్థానిక సన్ షైన్ ఇంగ్లిషు మీడియం స్కూలో చదివాడు. పదో తరగతిలో 589 మార్కులు సాధించగా ఐఐటీ చదవాలన్న అతడి లక్ష్యానికి పేదరికం అడ్డువచ్చింది. తండ్రి షేక్ యాకూబ్ టైలరింగ్ షాపులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లి సుహాన్‌బీబీ సహేబా గృహిణి. కొద్ది కాలం ప్రైవేటు పాఠశాలలో పనిచేసింది. ఇంటర్ కార్పొరేట్ కళాశాలలో చదివించే స్థోమత లేకపోవడంతో పాలిటెక్నిక్ ఎంట్రన్స్ రాయగా విశాఖలోని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కెమికల్ ఇంజనీరింగ్ బ్రాంచిలో సీటు వచ్చింది. తల్లిదండ్రులు విశాఖలో అద్దె ఇంట్లో ఉంటూ రజాక్‌ను మూడున్నర ఏళ్ల పాలిటెక్నిక్ చదివించారు. రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు రావడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. అబ్దుల్ రజాక్ మీడియాతో మాట్లాడుతూ జేఎన్టీయూలో బీటెక్ కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేస్తానన్నాడు. ఎంబీఏ చేసి పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నదే తన జీవిత లక్ష్యమని వివరించాడు.

8,586 విద్యుత్ కేసులు పరిష్కారం



విద్యుత్ సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరిస్తున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

» వినియోగదారులకు రూ.14 లక్షలు పరిహారం
» సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

కరప, మే 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని 11 జిల్లాల నుంచి విద్యుత్ సమస్యలకు సంబంధించి 8,748 కేసులు రాగా వాటిలో ఇప్పటివరకు 8,586 కేసులను పరిష్కరించినట్టు సీజీఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. కాకినాడ జిల్లా కరప విద్యుత్ ఉప కేంద్రం ఆవరణలో గురువారం నిర్వహించిన విద్యుత్ సమస్యల పరిష్కార వేదికలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సమస్యలు ఎదురైతే వినియోగదారులు సమీప అసిస్టెంట్ ఇంజనీర్ కార్యాలయంలో గానీ లేదా 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని, 60రోజుల్లో పరిష్కారం చూపకపోతే సంబంధిత అధికారుల నుంచి నష్టపరిహారం అందించేలా చూస్తామన్నారు. ఇలా ఇప్పటివరకు 108 కేసుల్లో అధికారులను బాధ్యులను చేస్తూ వారి నుంచి వినియోగదారులకు రూ.14,36,956 పరిహారంగా చెల్లించామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు, వ్యవసాయానికి 9 గంటలు ఉచిత విద్యుత్ సదుపాయం ఉందన్నారు. విద్యుత్ సమస్యలపై సంబంధిత అధికారులు పట్టించుకోకపోతే సీజీఆర్ఎఫ్‌ను సంప్రదించి న్యాయం పొందాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలకు గురై మరణించిన, అంగవైకల్యం పొందిన వారికి సంస్థ నుంచి పరిహారం అందుతుందన్నారు. ఈ విషయంలో అధికారులు సకాలంలో స్పందించకపోతే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసే అధికారం సీజీఆర్ఎఫ్‌కు ఉందని స్పష్టం చేశారు. అనంతరం వినియోగదారుల నుంచి 11 అర్జీలు స్వీకరించి వాటి సత్వర పరిష్కారానికి చొరవ తీసుకోవాలని అధికారులకు సూచించారు. సీజీఆర్ఎఫ్ ఫైనాన్స్ మెంబర్ సలాది సుబ్బారావు, ఇండిపెండెంట్ మెంబర్ ఎస్.మురళీకృష్ణ, విద్యుత్ శాఖ డీఈ తుమ్మలపల్లి విష్ణుమూర్తి, ఏఈ సానా ఈశ్వరప్రసాద్, జేఈ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.



కాకినాడలో కురుస్తున్న భారీ వర్షం



కోనసీమ జిల్లా అంబాజీపేటలో ఈదురుగాలులతో కూడిన వర్షం

వచ్చింది..వాన!

ప్రస్తుతం మండుతున్న ఎండలకు ప్రజలు అల్లాడిపోతున్నారు. వర్షం కురిస్తే బాగుండును వాతావరణం చల్లగా మారుతుందని ఆశపడుతున్నారు. అయితే గురువారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలుచోట్ల వర్షం పడి ఉపశమనం పొందారు.





కాకినాడ వర్షంలో వాహనదారులు

రోడ్డు ప్రమాదంలో బాలిక దుర్మరణం

బాలిక పై నుంచి వెళ్లిన ధాన్యం లోడు ట్రాక్టర్
రాయవరంలో ఘటన

రాయవరం, మే 15(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో 13 ఏళ్ల బాలిక దుర్మరణం చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం మహేంద్రవాడకు చెందిన పాలపర్తి నాగవర్షిణి (13) తన సమీప బంధువుతో కలిసి బైక్‌పై రాయవరంలో ఉన్న బంధువుల ఇంటికి గురువారం వచ్చింది. బంధువులు ఇంటి నుంచి తిరిగి మహేంద్రవాడకు ద్విచక్రవాహనంపై వస్తుండగా రాయవరంలో ధాన్యంలోడ్ ట్రాక్టర్‌ను తప్పించబోయే సమయంలో బైక్ అదుపు తప్పి ఇద్దరు కిందపడిపోయారు. ఆ సమయంలో వెనక కూర్చున్న బాలికపై నుంచి ధాన్యం లోడు ట్రాక్టర్ వెళ్లిపోవడంతో నాగవర్షిణి కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. బాలికను స్థానికులు హుటాహుటిన 108సాయంతో రామచంద్రపురం ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే బాలిక మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మండపేట ప్రభుత్వాసుపత్రిలో శవ పంచనామా నిర్వహించిన అనంతరం బంధువులకు బాలిక మృతదేహాన్ని అప్పగిస్తామని రాయవరం ఎస్‌ఐ సురేష్‌బాబు తెలిపారు. మృతురాలి తండ్రి పాలపర్తి వీరవెంకటసతన్నా రాయవరం గ్రామరెవెన్యూ సహాయకుడిగా పనిచేస్తున్నారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. ఇదిలాఉండగా నాగవర్షిణి 5 వతరగతి చదువుతుంది. మృతురాలి సోదరి ఒణీల వేడుక రెండు రోజుల క్రితమే నిర్వహించారు. కుటుంబసభ్యులు, బంధువుల మధ్య ఆనందంగా జరిగిన వేడుకను మరువకముందే ఈ సంఘటన జరగడంతో వారు జీర్ణించుకోలేకపోతున్నారు. సంఘటనా స్థలానికి మండపేట రూరల్ సీఐ పితల దొరరాజు చేరుకుని ప్రమా దంపై ఆరా తీశారు.



సంఘటనా స్థలంలో బాలిక

పిడుగుపడి కౌలు రైతు మృతి



బాలకృష్ణ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

కాజులూరు (కరప), మే 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మండలం జగన్నాథగిరి గ్రామంలో గురువారం సాయంత్రం పిడుగు పడి ఒక కౌలు రైతు మృతి చెందాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన బుకే బాలకృష్ణ (35) రామచంద్రపురం మండలం కాపవరంలోని అత్తగారి ఇంటి వద్ద ఉంటూ కౌలు రైతుగా జీవనం సాగిస్తున్నాడు. కాజులూరు మండలం పెనుమళ్ల గ్రామానికి చెందిన సలాది రాంబాబు అనే రైతుకు చెందిన రెండెకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాడు. గురువారం సాయంత్రం చేలో పని ముగించుకున్న బాలకృష్ణ తిరిగి కాపవరం వెళ్తుండగా భారీ వర్షం కురుస్తుండడంతో జగన్నాథగిరి గ్రామ సమీపంలో ఆగాడు. అదే సమయంలో అతడిపై పిడుగు పడడంతో ఘటనా స్థలంలోనే కుప్పకూలి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. జగన్నాథగిరి వీఆర్వో ఈశ్వర సత్యనారాయణ ఇచ్చిన రిపోర్టు మేరకు గొల్లపాలెం పోలీసులు విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాలకృష్ణ మృతితో కుటుంబసభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహం వద్ద బోరున విలపించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఎం.మోహన్‌కుమార్ తెలిపారు.

గోదావరిలో గుర్తుతెలియని మృతదేహాలు లభ్యం

కొవ్వూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్టు కొవ్వూరు పోలీసులు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని ఔరంగాబాద్-2 ఇసుకర్యాంపులో నదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 50ఏళ్లు ఉంటుందని, దేహంపై వైట్ కలర్ కట్ బనియన్, నలుపురంగు షార్ట్ ఉన్నాయని, ఆచూకీ తెలిసినవారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో లేదా 9440796622, 9492482056లో సమాచారం అందించాలన్నారు. దీనిపై కేసునమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

అలాగే పట్టణంలోని ఆరికిరేవుల రోడ్‌లోని దండకుంట పుంత ఇసుకర్యాంపులో గామన్ బ్రిడ్జి కింద గోదావరి నదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం తేలుతుందని స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు మృతదేహాన్ని నది నుంచి బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్లు ఉంటుందని, ఒంటిపై నీలం, తెలుపురంగుల గడుల షర్ట్, నీలంరంగు ప్యాంటు ఉన్నాయన్నారు. ఆచూకీ తెలిసినవారు సమాచారం అందించాలని, కేసు నమోదు చేసినట్టు సీఐ పేర్కొన్నారు.

చీటింగ్ కేసులో సర్పంచ్ భర్త అరెస్ట్

తొండంగి, మే 15 (ఆంధ్రజ్యోతి): ముగ్గురి నుంచి రూ.17.5 లక్షల మొత్తాన్ని కాకినాడ జిల్లా తొండంగి మండలం కోదాడ సర్పంచ్ బూర్తి రత్న కుమారి భర్త నాని చీటింగ్ చేసి కాజేసినట్టు వచ్చిన ఫిర్యాదుపై గురువారం కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తొండంగి ఎస్‌ఐ జగన్మోహన్ పేర్కొన్నారు. వివరాల ప్రకారం.. కోదాడ గ్రామానికి చెందిన నొక్కు సూర్యనారాయణ మరో ఇద్దరికి ఎస్ఈజడ్‌లో భూములు పోయినందుకు వచ్చిన పరిహారాన్ని నాని కాజేసినట్టు సూర్యనారాయణ ఫిర్యాదు చేశాడు. కొంతమొత్తం ఇచ్చి మిగిలిన మొత్తానికి ఖాళీ చెక్కులపై బెదిరించి బలవంతంగా సంతకాలు చేయించుకుని రూ.17.5 లక్షల సొమ్మును కాజేశాడన్నారు. పెద్దాపురం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఖాతా ఓపెన్ చేయించి ఆ మొత్తాన్ని కాజేసినట్టు ఆధారాలతో సూర్యనారాయణ ఫిర్యాదు చేశాడన్నారు. విచారణ జరిపి నానిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించిందన్నారు.

సామర్లకోట చైర్‌పర్సన్ పదవికి రాజీనామా

- కోర్టును ఆశ్రయించినా సమావేశాన్ని అడ్డుకోలేకపోయిన అరుణ
- అవిశ్వాస తీర్మాన సమావేశానికి 25 మంది వైసీపీ కౌన్సిలర్లు హాజరు



రాజీనామా లేఖను సామర్లకోట మున్సిపల్ కమిషనర్‌కు అందజేస్తున్న చైర్‌పర్సన్

సామర్లకోట, మే 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ జి.అరుణ (వైసీపీ)పై సొంత పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటిస్తూ కలెక్టర్‌కు లేఖ ఇచ్చిన నేపథ్యంలో ప్రత్యేకాధికారి మల్లిబాబు సమక్షంలో గురువారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దీంతో ఏకాకి అయిన చైర్‌పర్సన్ అరుణ గత్యంతరం లేని పరిస్థితుల్లో తన పదవికి రాజీనామా లేఖను సమావేశానికి గంట ముందుగా కమిషనర్ శ్రీవిద్యకు అందజేశారు. అప్పటికే ప్రత్యేక సమావేశం నిర్వహణకు అన్ని ఏర్పాట్లను అధికార యంత్రాంగం సిద్ధం చేసింది. ఇక తనకు ఓటమి తప్పదని భావించిన చైర్‌పర్సన్ అరుణ రాజీనామా లేఖను అందజేశారు. ఇప్పటికే సమావేశం నిర్వహించకుండా అడ్డుకునేందుకు చైర్‌పర్సన్ కోర్టులను సైతం ఆశ్రయించినప్పటికీ సమావేశం నిర్వహించేందుకు ఎటువంటి అడ్డంకులు లేకపోవడంతో గురువారం ముందుగా ఊహించిన రీతిలోనే సమావేశం నిర్వహించారు. అందరూ ఊహించినట్లు అవిశ్వాసానికి అనుకూలంగా 25 మంది కౌన్సిలర్లు చేతులెత్తి మద్దతు తెలిపారు. సమావేశానికి ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించిన మల్లిబాబు కౌన్సిలర్లను లెక్కించారు. తదనంతరం విలేకర్లతో మాట్లాడుతూ చైర్‌పర్సన్ కోర్టును ఆశ్రయించడంతో ఫలితాన్ని వెల్లడించడంలేదని చెప్పారు.

అందుకే అవిశ్వాసం ప్రకటించాం

మూడు నెలలు మాత్రమే చైరపర్సన్ పదవిలో కొనసాగేందుకు ముందుగా పార్టీ నాయకులు నిర్దేశించినప్పటికీ ఊహించని రీతిలో నాలుగేళ్ల పాటు పదవిలో కొనసాగిన చైర్‌పర్సన్ అరుణ సొంత పార్టీ కౌన్సిలర్లనే ఏమాత్రం లెక్కించకుండా ఏకపక్షధోరణి అవలంబించడం వల్లే కౌన్సిలర్లు అందరూ వ్యతిరేకించామని వైస్ చైర్మన్లు జాన్‌మోజెస్, గోకిన సునేత్రాదేవి, ఆవాల లక్ష్మీనారాయణ, పాగా సురేష్‌కుమార్, రెడ్నం సునీత, నేతల హరిబాబు పేర్కొన్నారు. కౌన్సిల్ ప్రత్యేక సమావేశం అనంతరం విలేకర్లతో వారు మాట్లాడుతూ పార్టీని, నాయకులను కించపరిచే రీతిలో చైర్‌పర్సన్ మాట్లాడడం దురదృష్టకరం అన్నారు. పార్టీ పలు దఫాలు చేసిన సూచనలు పెడత్రోవ పెట్టారన్నారు. పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా వ్యవహరించిన చైర్‌పర్సన్ అరుణను ఇప్పటికే పార్టీ అధిష్టానం సస్పెండ్ చేసిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. తదుపరి జరిగే కార్యక్రమాలకు పార్టీ అధిష్ఠానం సూచనల మేరకే తామంతా కలిసి పనిచేస్తామని, పట్టణాన్ని ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి పథంలోక పయనింపజేస్తామని వారు చెప్పారు.

'నన్నయ'లో జూలై 14 నుంచి ఈఎఫ్‌డీపీ కార్యక్రమం

వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మే 15 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో జూలై 15 నుంచి 19 వరకూ క్వాంటం టెక్నాలజీస్ అపర్చునిటీస్ అండ్ త్రెట్స్ అనే అంశంపై ఆఫ్‌లైన్ పద్ధతిలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నారని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను గురువారం వీసీ ఆవిష్కరించి వివరాలు తెలిపారు. అఖిలభారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఇ) ట్రైనింగ్ అండ్‌లెర్నింగ్ (ఏటిఏఎల్) నుంచి దీనికి అనుమతి లభించిందన్నారు. ఈ కార్యక్రమం ప్రస్తుతం ఇంజనీరింగ్ కళాశాలల్లో 2025-26 నుంచి మైనర్ డిగ్రీ వర్తింపచేసి అనుసరిస్తున్నవారికి చాలా ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలను విశ్వవిద్యాలయం వెబ్సైట్ నుంచి పొందవచ్చని తెలి పారు. ఈఎఫ్‌డీపీకి కోఆర్డినేటర్‌గా వి.పెర్సిస్, అసిస్టెంట్ కోఆర్డినేటర్‌గా జి.కీర్తి మరిట వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, కోఆర్డినేటర్ వి.పెర్సిస్, అసిసెటంట్ కోఆర్డినేటర్ జి.కీర్తిమరిట పాల్గొన్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

కుమారుడి కళ్లెదుటే మరణించిన తల్లి



లారీ కింద సుధా మృతదేహం



ఫైల్‌ఫొటో

కొవ్వూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని కుమారుడి కళ్లెదుటే తల్లి మృతిచెందిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే కొవ్వూరు జగనన్నకాలనీ గుత్తావారి చెరువు లేఅవుట్-1లో నివాసం ఉంటున్న దూసనపూడి సుధా (46) నందమూరు రోడ్‌లోని యువరాజ్ ఫంక్షన్ హాల్ ఎదురుగా టైలరింగ్ షాపులో టైలరింగ్ చేస్తుంది. భర్త కృష్ణసాయి పాసింజర్ ఆటో నడుపుతుంటాడు. కుమార్తె శ్రీలత డిగ్రీ చదువుతుంది. కుమారుడు చరణ్ ఉన్నాడు. ప్రతిరోజు కాలనీ నుంచి భర్త లేదా కుమారుడు గాని మోటారుసైకిల్‌పై షాపు వద్దకు తీసుకొస్తుంటారు. రోజు మాదిరిగా కుమారుడు చరణ్ గురువారం ఉదయం తల్లిని మోటారుసైకిల్‌పై తీసుకుని షాపునకు బయలుదేరాడు. గామన్‌బ్రిడ్జి సెంటర్ సమీపంలో దొమ్మేరురోడ్‌లో వేబ్రిడ్జి వద్దకు చేరుకునేసరికి వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. దీంతో ఇద్దరు కిందపడిపోయారు. సుధ నడుము పై నుంచి లారీచక్రాలు ఎక్కడంతో నుజ్జునుజ్జు అయ్యి అక్కడికక్కడే మృతిచెందింది. చరణ్‌కు కుడి చెయ్యి, కుడికాలు, కుడి పాదానికి గాయాలు కావడంతో స్నేహితుడి సహాయంతో చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న వెంటనే పట్టణ సీఐ విశ్వం సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చరణ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్టు సీఐ తెలిపారు.

కాకినాడలో యువకుడి హత్య



కిరణ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్‌పాటిల్

కాకినాడ క్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ యువకుడు హత్యకు గురైన సంఘటన గురువారం కాకినాడలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ ఏటిమొగకు చెందిన వాడ్రేవు బద్రీ కిరణ్ (20) ఐటీఐ చదివి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. తన పెంపుడు కుక్క అనారోగ్యంగా ఉండడంతో వైద్యం నిమిత్తం దానిని తీసుకుని తన స్నేహితుడైన పెసంగి శ్యామ్‌తో కలిసి బుధవారం కాకినాడ రామారావుపేటలోని వెటర్నరీ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అక్కడికి కిరణ్‌కు తెలిసిన పెమ్మాడి హరీష్, కోలా మహేష్ ఆటోలో వచ్చి అతడికి బలవంతంగా తీసుకునిపోయారు. అది చూసిన శ్యామ్ వెంటనే కిరణ్ తల్లి దుర్గకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. ఆమె రాత్రి వరకు చుట్టుపక్కల వెతికి అనంతరం పోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోర్టు సీఐ మ్యాన్ మిస్సింగ్ కేసుగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గురువారం కాకినాడ రూరల్ మండలం నేమాం సమీపంలోని ఎస్ఆర్ ఎంటీ చౌదరి ఘాట్ వద్ద సముద్రంలో బద్రీ కిరణ్ మృతదేహం తేలి ఉండడాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్, పోర్టు సీఐ సునీల్ కుమార్, సిబ్బంది సముద్ర తీరం వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి ఛాతిపైన, గొంతుపైన తీవ్ర రక్తపు గాయాలు ఉండడంతో ముమ్మాటికీ హత్యేనని నిర్ధారించి మిస్సింగ్ కేసును హత్య కేసుగా మార్చి దర్యాప్తు చేస్తున్నారు. బద్రీ కిరణ్‌కు, పెమ్మాడి హరీష్ భార్యకు వివాహేతర సంబంధం నేపథ్యంలోనే మరో స్నేహితుడు కోలా మహేష్ సహాయంతో హరీష్ బీర్ బాటిల్ పగులగొట్టి ఈ హత్యకు పాల్పడినట్టు భావించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తూరంగిలో చోరీ

సుమారు 160 గ్రాముల బంగారం, రూ.40,000 నగదు అపహరణ

కాకినాడ రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వెలమల తూరంగిలో చోరీ జరిగింది. ఇంద్రపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... చంద్రమౌళి శ్రీనివాసశర్మ (26) పౌరోహిత్యం చేస్తుంటాడు. ఆయన బుధవారం రాత్రి 10 గంటల తర్వాత ఇంటికి తాళాలు వేసి గృహప్రవేశ కార్యక్రమం నిమిత్తం పిఠాపురం వెళ్లాడు. కార్యక్రమాన్ని ముగించుకుని గురువారం ఉదయం 6 గంటలకు తన ఇంటికి వచ్చేసరికి గేటు, ఇంటికి వేసిన తాళాలు బద్దలు గొట్టి ఉండటంతో కంగారుగా ఇంటిని, గదిలోని బీరువాను పరిశీలించేసరికి సుమారు 160 గ్రాముల బంగారం, రూ.40,000 నగదు అపహరణకు గురైనట్టు గుర్తించి మధ్యాహ్నం ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఎం.వీరబాబు పేర్కొన్నారు. శ్రీనివాస శర్మ భార్య, పిల్లలు విశాఖ జిల్లా చోడవరం వెళ్లారని చెప్పారు. చోరీ జరిగిన ఇంటిని ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, క్లూస్ టీమ్ పరిశీలించారు.



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్

ఆదాయానికి మించి ఆస్తుల కేసులో...

డీఆర్ ఆనందరావు అరెస్టు

రాజమహేంద్రవరం/కాకినాడ మే 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ లంచం తీసుకుంటుండగా కె.ఆనందరావును మార్చి 28న ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఆయన బెయిల్‌పై ఉన్నారు. అయితే ఆ కేసు దర్యాప్తులో భాగంగా ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే సమాచారంతో ఈనెల 15న ఆయన కుటుంబ సభ్యుల ఇళ్లల్లో.. కాకినాడ, హైదరాబాద్, బోధన్ వంటి ప్రాంతాల్లోనూ సోదాలు చేశామని ఏసీబీ డీజీ అతుల్ సింగ్ పేర్కొన్నారు. ఆనందరావుపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నామని తెలిపారు.

జగ్గంపేటలో 'శుభం' సందడి



జగ్గంపేట, మే 15(ఆంధ్రజ్యోతి): శుభం చిత్రబృందం గురువారం కాకినాడ జిల్లా జగ్గంపేటలో సందడి చేసింది. సక్సెస్ మీట్‌లో భాగంగా జగ్గంపేట ఎస్‌విఎఫ్ నాగేశ్వర థియేటర్‌కు బృందసభ్యులు హర్షితారెడ్డి, శ్రియ, శ్రీనివాస్ గౌరెడ్డి, శ్రావణి లక్ష్మి, చరణ్ పెర్రి, షాలిని కొండేపూడి, వంశీధర్, డైరెక్టర్ ప్రవీణ్ కాండ్రేగుల, ఆర్య విచ్చేశారు. ప్రేక్షకులతో కలిసి సినిమా చూసి ఆడిపాడారు.

3 గంటల పాటు రాజమండ్రిలో వివేక్ ఎక్స్‌ప్రెస్

ఊడిన ఏసీ బోగీ యాక్సిల్ బాక్స్ రింగ్ కవర్
గుర్తించి నిలిపివేసిన టీఎక్స్ఆర్ సిబ్బంది

రాజమహేంద్రవరం, మే 15 (ఆంధ్రజ్యోతి): డిబ్రూగఢ్ నుంచి కన్యాకుమారి వెళ్తున్న ట్రైన్ నెంబర్ 22503 వివేక్ ఎక్స్‌ప్రెస్ మరమ్మతులకు గురికావడంతో తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి స్టేషన్‌లో 3 గంటల పాటు నిలిపివేశారు. ఇది భారతదేశంలో అతి ఎక్కువ రోజులు ప్రయాణించే రైలు. ఈ రైలు గురువారం రాత్రి 8.50 గంటలకు రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ మూడో ప్లాట్‌ఫాంకు చేరుకునే సమయంలో ఇంజన్ నుంచి 14వ బోగీ అయిన బీ1 ఏసీ బోగీ యాక్సిల్ బాక్స్ రింగ్‌కు ఉండే కవర్ ఊడిపోయి, బోల్టులు కూడా ఊడిపోతుండగా టీఎక్స్ఆర్ సిబ్బంది గుర్తించారు. అయితే కవర్ మార్చే ఏర్పాట్లు లేకపోవడంతో బీ1 బోగీని రాజమండ్రి స్టేషన్‌లో వదిలేసి మిగతా రైలును 11:50 ప్రాంతంలో పంపించారు. బీ1 బోగీలోని ప్రయాణికులను వేరే బోగీలో సర్దుబాటు చేశారు. విశాఖలో మరొక బోగీని లింక్ చేస్తామని అధికారులు తెలిపారు. ఎస్ఎంఆర్ రంగనాథ్, చీఫ్ కమర్షియల్ ఇన్ స్పెక్టర్ కల్యాణ్ కుమార్ మరమ్మతులను పర్యవేక్షించారు. ఆర్‌పీఎఫ్ సిబ్బంది బందో బస్తు నిర్వహించారు. విషయం గుర్తించక పోతే రైలు పట్టాలు తప్పి పెను ప్రమాదమే కలిగేది.





రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో ఉండిపోయిన బీ1 బోగి, ఊడిపోయిన బాక్స్ రింగ్ కవర్

చీటింగ్ కేసులో నిందితుడికి ఏడాది జైలు

కరప, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి చీటింగ్ చేసిన వ్యక్తికి ఒక ఏడాది జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ కాకినాడ స్పెషల్ జేఎఫ్‌సీఎం కోర్టు మేజిస్ట్రేట్ తీర్పు ఇచ్చినట్టు కరప పోలీసులు తెలిపారు. కాకినాడ జిల్లా కరప మండలం పెద్దాపురప్పాడు గ్రామానికి చెందిన బిరుదా వెంకటరమణ అనే వ్యక్తి కుమారుడికి స్టీల్‌ప్లాంట్‌లో నెలకు రూ.50వేలు జీతం వచ్చే ఉద్యోగం ఇప్పిస్తానంటూ వైజాగ్‌కు చెందిన పూరెడ్డి శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి నమ్మించాడు. ఈ క్రమంలో వెంకటరమణ నుంచి రూ.10లక్షలు తీసుకుని ముఖం చాటేశాడు. ఉద్యోగం ఇప్పించకపోగా తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వాలని అడగ్గా చంపుతానని బెదిరించాడు. దీంతో చేసేదిలేక వెంకటరమణ 2015 డిసెంబరు 10వ తేదీన కరప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదుచేసిన అప్పటి ఎస్‌ఐ కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేశారు. వాదోపవాదనల అనంతరం శ్రీనివాసరెడ్డి నేరం చేసినట్టు రుజువుకావడంతో ఏడాది జైలు శిక్ష విధిస్తూ స్పెషల్ జేఎఫ్‌సీఎం ఫర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ ఎ.నాగమల్లేశ్వరి తీర్పు వెలువరించారు. బాధితుడి తరపున ఏపీపీ ఎస్.నాగరాధిక ఈ కేసు వాదించారు. ఈ కేసుకు సంబంధించిన సాక్షులు, సాక్ష్యాలను సమర్థవంతంగా కోర్టుకు అందజేసి నిందితుడికి శిక్షపడేలా చేసిన ఎస్‌ఐ సునీత, కోర్టు కానిస్టేబుల్ కె.రాజేష్‌లను సీఐ చైతన్యకృష్ణ అభినందించారు.

మహిళ మెడలోని బంగారం చోరీ

కాజులూరు (కరప), మే 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మండలం పెనుమళ్ల గ్రామంలో భర్తతో కలిసి మోటర్‌సైకిల్‌పై వెళ్తున్న ఒక మహిళ మెడలోని 52గ్రాముల బంగారాన్ని గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు అపహరించుకుపోయారు. గొల్లపాలెం పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అండ్రంగి గ్రామానికి చెందిన బండారు త్రిమూర్తులు, అతడి భార్య సూర్యకాంతం గురువారం తెల్లవారుజామున 4గంటల సమయంలో మోటర్‌సైకిల్‌పై బంధువుల ఇంటికి వెళ్తున్నారు. పెనుమళ్ల గ్రామ శివారుకు వచ్చేసరికి గుర్తుతెలియని ఇద్దరు వ్య క్తులు వెనుక నుంచి వచ్చి సూర్యకాంతం మెడలోని బంగారు పుస్తెలతాడు, నల్లపూసల దండను బలవంతంగా లాక్కుని పారిపోయారు. నిందితులను వెంబడించినా ఫలితం లేకపోవడంతో బాధితులు గొల్లపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ మోహన్‌కుమార్ తెలిపారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

పిఠాపురంలో వాహనాల తనిఖీ

పిఠాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో పోలీసులు గురువారం సాయంత్రం కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. డ్రైవింగ్ లైసెన్సు లేని వారికి జరిమానా విధించారు. రికార్డులు లేని వాహనాలను సీజ్ చేశారు. పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండబాబు

18న కాకినాడలో మినీ మహానాడు

కాకినాడ సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కాకినాడ సిటీ నియోజకవర్గ మినీ మహానాడును ఈ నెల 18వ తేదీ ఉదయం 10 గంటలకు సూర్యకళామందిరంలో పండుగ వాతావరణంలో నిర్వహిస్తామని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు వెల్లడించారు. దీంతో పాటు కడపలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించే మహానాడుపై గురువారం ఆయన తన స్వగృహంలో పార్టీ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. నగర శాఖ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, గదుల సాయిబాబు, బచ్చు శేఖర్, పలివెల రవిఅనంతకుమార్, చింతా పేర్రాజు, పంతాడి రాజు, అంబటి చిన్న, బంగారు సత్యనారాయణ, గాది శివ, తుమ్మల సునీత, పీర్ల లక్ష్మీప్రసన్న, వాసంశెట్టి చిట్టప్ప, జొన్నాడ వెంకటరమణ, గుమ్మళ్ల చిన్న, పాలిక నాని, అమలకంటి బలరామ్, రెడ్నం సత్తిబాబు, చోడిపల్లి సతీష్, పొంగా బుజ్జి, మూగు రాజు, కోడూరి పెద్ద, గెడ్డం పూర్ణ, రాణి తదితరులు పాల్గొన్నారు.



ర్యాంకర్లను సత్కరిస్తున్న సంకురాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ చంద్రశేఖర్

టెన్త్ ర్యాంకర్లకు సత్కారం

పిఠాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): సహృదయ మిత్రమండలి ఆధ్వర్యంలో పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని భావనరావు సభా సదన్‌లో 15రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు గురువారం సాయంత్రం ముగిశాయి. పదో తరగతిలో రాష్ట్రస్థాయిలో మొదటి రెండు ర్యాంకులు సాధించిన భాష్యం స్కూలు విద్యార్థులు యాళ్ల నేహాంజని, కొట్టేటి ప్రేమ సత్య లిఖితలను, ప్రభుత్వ పాఠశాలల్లో పిఠాపురం పట్టణంలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్లస్, మునిసిపల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు మరుకుర్తి శ్రీకీర్తన, నిమ్మకాయల వెంకట వైశాలి, గాది మహాలక్ష్మిలను సంకురాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పద్మశ్రీ డాక్టర్ చంద్రశేఖర్ సత్కరించారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్లు, పుస్తకాలు, పెన్నులు అందజేశారు. చక్రధర్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు వెన్నపు చక్రధరరావు, సూర్యరాయ గ్రంథాలయ కార్యదర్శి కొండేపూడి శంకరరావు, ఎంఈవో శ్యాంబాబు, శిక్షకులు పి.కామరాజు, పోతుల శ్రీనివాస్, గంగాపావని, గాయత్రి, మిత్రమండలి ప్రధాన కార్యదర్శి సీహెచ్ సతీష్ పాల్గొన్నారు.



పిఠాపురంలో రక్తదానం చేస్తున్న పాడా ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణి

తలసీమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం

పిఠాపురం రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో తలసీమియా చిన్నారుల కోసం గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణితో పాటు ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది 125 మంది రక్తదానం చేశారు. శిబిరాన్ని జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు సందర్శించి రక్తదాతలను అభినందించారు. తహసీల్దారు వీవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో చిన్నారావు, మునిసిపల్ కమిషనరు కనకారావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాండ్రకోటలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. విత్తనాల వెంకటరమణ, నూనె రామారావు, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

'జీవ వైవిధ్య పరిరక్షణ అందరి బాధ్యత'

కాకినాడ రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ జీవ వైవిధ్య మండలి ఆధ్వర్యంలో కాకినాడ గాంధీనగర్ శాఖా గ్రంథాలయం ప్రాంగణంలో గురువారం జిల్లాస్థాయి చిత్రలేఖనం, క్విజ్, ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న జిల్లాలోని 48 పాఠశాలలు, 218 కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జీవ వైవిధ్య మండలి ప్రాంతీయ సమన్వయకర్త వి.సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రతి జీవికీ భూమిపై జీవించే హక్కు ఉంది, వాటి సంరక్షణ మనందరి బాధ్యత అన్నారు. అటవీ శాఖ రేంజర్ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతిఏటా దాదాపు 10వేల జీవజాతులు అంతరించిపోతున్నాయన్నారు. ఎం.శ్రీనివాసరావు, ఎం.రవికుమార్, వాకాడ వెంకటరమణ, మహేశ్వరరావు, నేరి బలరామకృష్ణ, పిల్లి గోవిందరాజులు, కేసరి శ్రీనివాసరావు, నారాయణమూర్తి, చిన్నబాబు, సావిత్రిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణకు అభ్యర్థుల ఎంపిక

కాకినాడ సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు నేతృత్వంలో బీటెక్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఫ్రంట్ ఎండ్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ శిక్షణకు మొదటి బ్యాచ్‌లో 35 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. సుమారు 500 మంది రిజిస్టర్ చేసుకోగా గురువారం ఎంపీ క్యాంపు కార్యాలయంలో రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ఎంపీ కార్యాలయ ప్రతినిధులు మాట్లాడుతూ మూడు నెలల పాటు జరిగే శిక్షణను ఎంపీ సతీష్‌బాబు సొంత ఖర్చుతో పూర్తిగా ఉచితంగా అందిస్తారన్నారు.



మొదటి బ్యాచ్ శిక్షణకు అభ్యర్థులను ఎంపిక చేస్తున్న దృశ్యం

85 మంది పేదలకు కళ్లజోళ్లు, దుస్తులు పంపిణీ

కాకినాడ రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామారావుపేట లయన్స్ క్లబ్ హాల్లో రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎంపిక చేసిన 85 మంది పేదలకు కళ్లజోళ్లు, దుస్తులను కార్యదర్శి కళ్యాణీప్రసాద్ గురువారం ఉచితంగా పంపిణీ చేశారు. ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ బాదం బాలకృష్ణ, కోశాధికారి జగన్నాథరావు, పాపారావు, రామ్‌చరణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కళ్లజోళ్లు, దుస్తులు అందజేస్తున్న రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థులు

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు

కరప, మే 15 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని, వారి సామర్థ్యాలను గుర్తించి వ్యాపార రంగంలోకి ప్రవేశించేందుకు అవసరమైన శిక్షణ, ఆర్థిక సహాయం, మార్కెట్ యాక్సెస్ వంటి సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని డీఆర్‌డీఏ పీడీ జి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. కరప చంద్రన్న సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన మహిళా పరిశ్రమ శక్తి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మహిళా స్వయం సహాయక సంఘాలు తమ సామర్థ్యాన్ని ఉపయోగించి చిన్న పరిశ్రమలు, సేవా రంగాలు, ట్రేడింగ్ వంటి వ్యాపారాల్లోకి ప్రవేశించి సాధికారిత సాధించాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకం గురించి వివరించి ప్రతి ఒక్కరూ తమ ఇళ్లకు సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఔత్సాహిక వ్యాపారవేత్తల వివరాలను నమోదు చేసుకుని వారికి బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆయా గ్రామాల వీవోఏలు తమ పరిధిలోని డ్వాక్రా సంఘాల మహిళలు చేపడుతున్న వ్యాపారాలను పీడీకి వివరించారు.

అవగాహన సదస్సులో పరిశ్రమల శాఖ సహాయ సంచాలకుడు ఎస్.విజయ్‌కుమార్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజరు ఎంఎం జిలానీ, ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, డీపీఎంలు కేశవ్, వెంకటేశ్వరరావు, బాబూరావు, ఐకేపీ ఏపీఎం ఎం.బాలాదేవి, ఫిషరీస్ అసిస్టెంట్ నవ్యశ్రీ, మండల సమాఖ్య అధ్యక్షురాలు సీహెచ్ అరుణ, సీసీ పుష్పలత, ప్రసాద్, రామమణి, వీవోఏలు, మత్స్యకార మహిళా సంఘాల ప్రతినిధులు, మహిళా వ్యాపారులు పాల్గొన్నారు.



వీవోఏలతో చర్చిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు





కొత్తపల్లి మండలం కొండెవరంలో కాటన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు, కరప మండలం సిరిపురంలో నివాళులర్పిస్తున్న సర్పంచ్ సుజాతవీరబాబు

ఘనంగా కాటన్ జయంతి

కరప, మే 15 (ఆంధ్రజ్యోతి): అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని సిరిపురంలో సర్పంచ్ నున్న సుజాతవీరబాబు ఆధ్వర్యంలో కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెనుగుదురులో కాటన్ విగ్రహానికి రాష్ట్ర బీసీ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, తెలగాని వీరభద్రరావు, వనుం శ్రీనివాసరావు, కిరణ్‌కుమార్, గంటా నాని, జి.బావారంలోని కాటన్ విగ్రహానికి స్థానిక నాయకులు పూలమాలలు వేశారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండెవరం దుర్గాదేవి ఆలయ సమీపంలోని కాటన్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ దుళ్ల సత్తిబాబు, మాజీ ఎంపీటీసీలు గాది రాజబాబు, కూరాకుల సుధాకర్, టీడీపీ ఎస్సీ సెల్ ప్రతినిధి వేమగిరి రాంబాబు, బర్రే వీరభద్రరావు, గొర్ల వెంకటరమణ, గాది సత్తిపండు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): వేట్లపాలెంలో కాటన్ విగ్రహానికి పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గోలి వెంకట్రావు విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. రోటరీ క్లబ్ సౌజన్యంతో గోలి శ్రీరామ్ యూత్ సభ్యులు నిర్వహించిన శిబిరంలో సుమారు 65 మంది యువకులు రక్తదానం చేశారు. రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుణ్ణం చంద్రమౌళి, కాకినాడ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నున్న రామకృష్ణ, పాలకుర్తి శ్రీనుబాబు, కొండపల్లి కృష్ణమూర్తి, గుమ్మళ్ళ రామకృష్ణ, గోలి శ్రీరామ్‌చౌదరి, రాజా సూరిబాబురాజు తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్‌లో గల స్వామి వివేకానంద జ్ఞాన మందిరంలో కాటన్ చిత్రపటానికి స్వచ్ఛ గొల్లప్రోలు కన్వీనర్ కొశిరెడ్డి రాజా, జ్ఞాన మందిరం వ్యవస్థాపకుడు పడాల కన్నారావు, మాజీ ఎంపీపీ వర్దనపు వీర్రాజు, చోడపునీడి పుల్లపురాజు, దర్శిపూడి విశ్వేశ్వరరావు, కొమ్ము సత్యనారాయణ, కర్రి కొండలరావు పాల్గొన్నారు.



ధ్వజస్తంభం పైభాగం ఒరిగిన దృశ్యం

ప్రమాదకరంగా ధ్వజస్తంభం

గొల్లప్రోలు, మే 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్‌రోడ్డులో వేంచేసియున్న సీతారామస్వామి దేవస్థానం (విష్ణాలయం)లోని ధ్వజస్తంభం పైభాగం గురువారం ఒక వైపు ఒరిగింది. చెక్క భాగానికి చెదపట్టడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని భక్తులు తెలిపారు. తక్షణం మరమ్మతులు నిర్వహించకుంటే ధ్వజస్తంభం శిఖర భాగం ఏక్షణమైనా పడిపోవచ్చని వారు ఆందోళన చెందుతున్నారు.



కరపలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ తాతీలు

క్రికెట్ టోర్నీ ప్రారంభం

కరప, మే 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వలసపాకల క్రికెట్ కార్నివాల్ సీజన్-4 టోర్నమెంట్‌ను మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు గురువారం ప్రారంభించారు. వలసపాకలకు చెందిన ఐదు టీమ్‌లు పాల్గొంటున్నాయి. 31న ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది. నిర్వాహకులు కాలేటి సునీల్‌కుమార్, మేడిశెట్టి సత్యనారాయణ, జాన్, ముదుగు జశ్వంత్, ఉంద్రజపు కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ సీబీఎస్ఈలో దేవహాసన్ ఫస్ట్



సర్పవరం జంక్షన్, మే 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ పి.వెంకటాపురంలోని కేంద్రీయ విద్యాలయానికి చెందిన 33 మంది పదో తరగతి సీబీఎస్ఈ పరీక్షలు రాయగా అంతా ఉత్తీర్ణత సాధించారు దేవహాసన్ 500 మార్కులకు 464 సాధించి ప్రథమ స్థానంలో నిలిచినట్టు ప్రిన్సిపాల్ బొంతు శేఖర్ తెలిపారు. 463 మార్కులతో స్నేహ శరణ్య ద్వితీయ, 449 మార్కులతో కె.భాను తృతీయ స్థానాల్లో నిలిచారు.





పిఠాపురంలో మహిళల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ, కొత్తపల్లి మండలం కొండెవరంలో మహిళకు చీర పంపిణీ చేస్తున్న వర్మ

మాజీ ఎమ్మెల్యే వర్మ జన్మదిన వేడుకలు

పిఠాపురం/గొల్లప్రోలు, మే 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ జన్మదిన వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. వారి సమక్షంలో వర్మ కేక్ కట్ చేశారు. వర్మ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. గొల్లప్రోలులో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుంధ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్ వద్ద పేదలకు అన్నదానం చేశారు. వర్మకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పుట్టినరోజు సందర్భంగా కొండెవరంలో 120 మందికి చీరలు పంపిణీ చేశారు. ఎంపీటీసీ దుళ్ల సత్తిబాబు, మాజీ ఎంపీటీసీలు గాది రాజబాబు, కూరాకుల సుధాకర్, టీడీపీ ఎస్సీ సెల్ ప్రతినిధి వేమగిరి రాంబాబు, బర్రే వీరభద్రరావు, గుత్తిర్తి వెంకటరమణ, గొర్ల వెంకటరమణ, ముమ్మిడి నాగబాబు, వాసంశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కాకినాడ సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి పలువురికి మంజూరైన రూ.4లక్షల చెక్కులను ఎమ్మెల్యే వనమాడి కొండబాబు గురువారం తన స్వగృహంలో అందజేశారు. సంగాని నాగూర్, మేడిశెట్టి చిన్ని, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేట్లపాలెంలో అభివృద్ధి పనులు ప్రారంభం

సామర్లకోట, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేట్లపాలెంలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప గురువారం ప్రారంభించారు. ఉప సర్పంచ్ గోలి శ్రీరామ్‌చౌదరి ఆధ్వర్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం భవనాలను ప్రారంభించారు. జలజీవన్ మిషన్ నిధులు రూ.2.68 కోట్లతో ఓవర్‌హెడ్ రిజర్వాయర్ నిర్మాణంతో పాటు అదనపు పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. వ్యవసాయ శాఖ సబ్సిడీపై మంజూరు చేసిన యంత్ర పరికరాలను రైతులకు అందజేశారు. సర్పంచ్ చిల్లి వెంకటలక్ష్మి, పాలకుర్తి శ్రీనుబాబు, ఎంపీపీ బి.సత్తిబాబు, తోటకూర శ్రీనివాస్, రాజా సూరిబాబురాజు, కొండపల్లి కృష్ణమూర్తి, గుమ్మళ్ల రామకృష్ణ, కొండపల్లి జగ్గారావు, ఎంపీడీవో హిమమహేశ్వరి, ఎంఏవో ఐ.సత్య, కొండపల్లి జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.



వేట్లపాలెంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

గొల్లప్రోలులో బాలుడికి మలేరియా లక్షణాలు

గొల్లప్రోలు, మే 15 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు ఎస్సీ కాలనీలో తొమ్మిదేళ్ల బాలుడికి మలేరియా జ్వరం లక్షణాలు కనిపించాయి. ఇతడు ఇటీవల ఏజెన్సీ ప్రాంతంలోని బంధువుల ఇంటికి వెళ్లొచ్చాడు. సిబ్బంది పరిశీలించగా మలేరియా లక్షణాలు కనిపించడంతో చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లప్రోలు అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ అమృతరావు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే చేపట్టారు. బాలుడి ఇంటి పరిసరాలను పరిశీలించారు. ఆ ప్రాంతంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బాలుడి ఇంటిని డివిజనల్ మలేరియా అధికారి డానియేల్ సందర్శించారు.



ఎస్సీ కాలనీలో సర్వే నిర్వహిస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు, సిబ్బంది

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

గొల్లప్రోలు రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి గురువారం గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కర్రి స్వప్న, బ్యాంకర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వారి సర్టిఫికెట్లను పరిశీలించి యూనిట్ల ఏర్పాటుపై అవగాహనను పరిశీలించారు. రుణాలకు 116 మంది దరఖాస్తు చేసుకోగా 83 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. రాని వారికి శుక్ర, శనివారాల్లో అవకాశం కల్పించామని ఎంపీడీవో తెలిపారు.



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న జిల్లా ప్రజా రవాణాధికారి శ్రీనివాసరావు

సరస్వతి నది పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

కార్పొరేషన్ (కాకినాడ), మే 15 (ఆంధ్రజ్యోతి): సరస్వతి నది పుష్కరాల్లో భాగంగా 'సరస్వతీ ధామం' పుష్కర యాత్ర పేరిట స్టార్ లైనర్ నాన్ ఏసీ స్లీపర్ బస్సును ఆర్టీసీ కాకినాడ డిపోలో గురువారం కాకినాడ జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. అసిస్టెంట్ మేనేజరు ఎస్‌కేఎం బాషా, వి.ధర్మారావు, వీఆర్వో సీహెచ్ వెంకట్రాజు హాజరయ్యారు. ఈ బస్సు ఈ నెల 18న కాకినాడ చేరుకుంటుందని, రెండో సర్వీసుగా 22న సూపర్‌లగ్జరీ బస్సు బయల్దేరుతుందని శ్రీనివాసరావు చెప్పారు.

యు.కొత్తపల్లి-కాకినాడ జీజీహెచ్ బస్సు సర్వీసు పునరుద్ధరణ

కలెక్టరేట్ (కాకినాడ), మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ చొరవతో యు.కొత్తపల్లి-కాకినాడ జీజీహెచ్ మధ్య ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించారు. కొత్తపల్లి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రి వరకు గతంలో ఆర్టీసీ బస్సులు నడిపేవారు. ఐదు సంవత్సరాలుగా వాటిని నిలుపుదల చేశారు. దీంతో రోగులు, విద్యార్థులు, వృద్ధులు అనేక ఇబ్బందులు పడుతున్నారని కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో యు.కొత్తపల్లి గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే ఆర్టీసీ సర్వీసులను పునరుద్ధరించాలని ఆయన ఆదేశించారు. ఈ బస్సు ప్రతిరోజూ ఉదయం 6.30 గంటలకు కాకినాడలో బయల్దేరి 7.30 గంటలకు కొత్తపల్లి చేరుకుంటుంది. అక్కడి నుంచి 7.50 గంటలకు బయల్దేరి ఉప్పాడ, సుబ్బంపేట, నేమాం, వాకలపూడి లైట్‌హౌస్, వలసపాకల, సర్పవరం జంక్షన్ మీదుగా 9.05 గంటలకు కాకినాడ జీజీహెచ్‌కు చేరుకుంటుంది. సాయంత్రం 4.40 గంటలకు కాకినాడ జీజీహెచ్ వద్ద బయల్దేరి సాయంత్రం 5.55 గంటలకు కొత్తపల్లి చేరుకుంటుంది. తిరిగి కొత్తపల్లిలో సాయంత్రం 6.10 గంటలకు బయల్దేరి రాత్రి 7.10గంటలకు కాకినాడ చేరుకుంటుందని జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు వివరించారు.

ఘనంగా సత్తెమ్మతల్లి జాతర

గండేపల్లి, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేపల్లి నీలికుండీలతోటలో సత్తమ్మతల్లి జాతర ఘనంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలు, గరగనృత్యాలు, బాణసంచాతో అమ్మవారిని ఊరేగించారు. చిన్నారుల కోలాట ప్రదర్శనలు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



మండల సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

ప్లాస్టిక్ నిషేధం కంపెనీల నుంచే జరగాలి

వై.రామవరం, మే 15(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధం దుకాణాల నుంచి కాకుండా వాటిని తయారుచేసే కంపెనీలు, ఫ్యాక్టరీల నుంచే అమలు చేయాలని వై.రామవరం మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం మండల పరిషత్ సమావేశపు హాల్‌లో ఎంపీపీ ఆనందరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈవోపీఆర్డీ శివకుమార్‌కు సూచించారు. పంచాయతీలో పలు పనులు ప్రజా ప్రతినిధులకు తెలియడం లేదని గ్రామాలు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. బొడ్డగండి, పాలగడ్డ రోడ్డు అస్తవ్యస్తంగా ఉందని కోట్ల రూపాయలు దుర్వినియోగం అయ్యాయని కనీసం నడకదారి లేక రైతులు కన్నీళ్లు పెట్టుకున్నారని ఎంపీటీసీ కరకా వెంకటరమణ ఆవేదన చెందారు. వేసవిలో తాగు నీటి కొరత ఉందని బోర్లు నిర్మాణాలు, మరమ్మతులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈను కోరారు. మండలంలో గృహ నిర్మాణ పనులు కాంట్రాక్టర్ నుంచి సబ్ కాంట్రాక్టర్లకు మారడంతో పనులు పూర్తికావడం లేదని ఒకే కాంట్రాక్టర్‌తో పూర్తి చేయించాలని సూచించారు. సమావేశానికి హాజరుకాని ట్రైబల్ వెల్ఫేర్ శాఖకు, ఇతర శాఖలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంపీటీసీ వెంకటరమణ, ఎంపీపీ ఆనందరావుకు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో బాపన్నదొర, జడ్పీటీసీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు విశ్వమ్మ, జోగిరెడ్డి, తహసీల్దార్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన గిరిజన నాయకులు

దేవీపట్నం, మే 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డిని గురువారం రంపచోడవరంలో దేవీపట్నం మండల గిరిజన నాయకులు కలిశారు. ఈసందర్భంగా ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కారం రామన్నదొర, కుండ్ల సాయిరాంరెడ్డి, భానుశంకర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, ఇందుకూరు కొండలదొర తదితరులతో పాటు సంఘ నాయకులు యలగాడ నాగేశ్వరరావు, బండారు శ్రీనివాస్, దూసరి హరిబాబు, మన్నెపల్లి కనకరావు, ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ ఉన్నారు.

రంపచోడవరం, (ఆంధ్రజ్యోతి): ఎస్టీ కమీషన్ చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డిని బీజేపీ నాయకులు, శ్రేణులు గురువారం కలిసి అభినందనలు తెలిపారు. బీజేపీ మండల ఇన్‌ఛార్జి కె.ఎల్.ఎన్.జి. ప్రసాద్ తదితరులు ఉన్నారు. అంతకు ముందు ఆర్ఎస్ఎస్ విభాగాలు, బీజేపీ అనుబంధ విభాగాలు, గిరిజన మోర్చా విభాగాల నాయకులు చైర్మన్‌ను కలిసి అభినందించారు.



బొజ్జిరెడ్డిని సత్కరిస్తున్న ఆదివాసీ నాయకులు

ధర్మరక్షణ కోసమే...భగవంతుని అవతారాలు



మాట్లాడుతున్న సాయిరాం

చింతూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): ధర్మరక్షణకు భగవంతుడు ఒక్కో యుగంలో ఒక్కో అవతారంతో ఆవిర్భవిస్తాడని సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర ప్రాంత సహ సంయోజక్ ఎం.సాయిరాం అన్నారు. గురువారం చింతూరులోని కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో సేవా ఫౌండేషన్ సమావేశం జరిగింది. దీనికి మండల మహిళా కన్వీనర్ అల్లి కృష్ణవేణి అధ్యక్షత వహించారు. జ్యోతి ప్రజ్వలన, ప్రార్థన శ్లోకాలతో ప్రారంభమైన సమావేశంలో భగవంతుడి అవతార, ఆవిర్భావాలపై సాయి రాం తెలిపారు. కార్యక్రమంలో గోదావరి జోన్ ధర్మ ప్రచారక్ టీపీవీ జగన్నాథం, రంపచోడ వరం జిల్లా మహిళా కన్వీనర్ సవలం పద్మావతి, చింతూరు ఖండ ధర్మ ప్రచారక్ కర్రి చిన శ్రీనివాస్, వీఆర్ పురం మండల ధర్మ ప్రచారక్ ముత్యాల శ్రీరామకృష్ణ, ఎటపాక మండల కన్వీనర్ గంధం జయమ్మ, మహిళా కార్యకర్తలు, మండలాల కమిటీలు పాల్గొన్నాయి.

ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్‌ని ఏర్పాటు చేయాలి

చింతూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): తక్షణమే ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్‌ని ఏర్పాటు చేయాలని ఆదివాసీ జేఏసీ డిమాండ్ చేసింది. తమ డిమాండ్ల సాధనే లక్ష్యంగా ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం చింతూరు ఐటీడీఏ ముందు రిలే దీక్షలు ప్రారంభించారు. ఈ దీక్షను చింతూరు డివిజన్ జేఏసీ చైర్మన్ జల్లా నరేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు మడివి నెహ్రూ, పూసం శ్రీను, తుష్టి జోగారావు, సోడె నారాయణ, కాక రాజు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో వైద్య సేవలందించాలి

చింతూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): రోగులకు అంకిత భావంతో వైద్య సేవలందించాలని డీసీ హెచ్ఎస్ (జిల్లా సమన్వయ అధికారి) డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు. గురువారం చింతూరు ఏరియా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రికార్డుల నిర్వహణ తీరులను ఆమె తనఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైద్య సేవలపై వార్డుల్లో పర్యటించి వ్యాధిగ్రస్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు అంశాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డిని ఆరా తీశారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌కు సహకరించండి



అర్జీకి రశీదు అందజేస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి, మే 15(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు స్టాల్స్ ఏర్పాటు చేయడానికి సహకారం అందించాలని కిండ్ర కాలనీ గ్రామానికి చెందిన గంపా నాగరాజు జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి రాకేష్‌కు గతనెల 25న పాడేరు జిల్లాలో అర్జీ అందజేశారు. స్టాల్స్ ఏర్పాటుకు నిధులు కేటాయించలేదని, ఈ విషయాన్ని ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకుని వెళతానని అర్జీకి సమాధాన ప్రతిని పంపారని నాగరాజు తెలిపారు. మన ప్రాంతంలో పంటలు ఇక్కడే అమ్ముకోవడానికి ప్రభుత్వ తోడ్పాటు అవసరమని బాలకృష్ణ అన్నారు. కార్యక్రమంలో గంపా నాగరాజు, వంతు బాలకృష్ణ, వజ్రపు అప్పారావు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంత ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి వినతి

రంపచోడవరం, మే 15(ఆంధ్రజ్యోతి) గిరిజన ప్రాంత ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డిని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ గురువారం కలిసింది. తెలుగునాడు ఉపాధ్యాయ సం ఘం జిల్లా అధ్యక్షుడు ఎల్.వెంకటేశ్వర్లు ఆధ్వ ర్యంలో సంఘం నాయకులు కమిషన్ చైర్మన్‌ను కలిసి సమస్యలు తెలిపారు. చైర్మన్‌ను కలిసిన వారిలో నాయకులు బోండ్ల వరప్రసాద్, వి.కర్ణదొర, సత్తు కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ దంపతులను తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం తరపున పలువురు సత్కరించారు.

ఆటోల్లో పరిమితికి మించి ఎక్కించుకుంటే చర్యలు

దేవీపట్నం, మే 15(ఆంధ్రజ్యోతి): దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ ఆధ్వర్యంలో గురువారం పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీ నిర్వహించారు. గోకవరం నుంచి ఇందుకూరుపేట మీదుగా పోతవరం వైపు వెళ్లే వాహనాల రికార్డులు పరిశీలించారు. రికార్డులు సరిగ్గాలేని పలు వాహనదారులకు అపరాధ రుసుమ విధించారు. రికార్డులు సక్రమంగా లేకపోయినా, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నా వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

అధికారుల నిర్లక్ష్యం.. ప్రయాణికులకు ప్రమాదం!

రాత్రి వేళల్లో తొలగించని సేఫ్టీ కోన్లు

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



నీలాద్రిరావుపేట జాతీయ రహదారిపై నిర్లక్ష్యంగా వదిలేసిన సేఫ్టీ కోన్లు

గండేపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): హైవే అధికారులు రోడ్డు పనుల్లో భాగంగా జాతీయ రహదారిపై ఏర్పాటు చేస్తున్న సేఫ్టీ కోన్లను నిర్లక్ష్యంగా వదిలేయడంతో రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రయాణికులు గాయాలపాలవుతున్నారు. బుధవారం రాత్రి నీలాద్రిరావుపేట జాతీయ రహదారి మధ్యలో ఐదు కోన్లు వదిలేయడంతో చీకట్లో కోన్లు కనిపించక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు ద్విచక్రవాహనదారులైతే ప్రమాదం నుంచి బయటపడ్డారని స్థానికులు చెపుతున్నారు. కోన్లు చీకట్లో కనిపించకపోవడం వల్ల దగ్గరకు సడన్ బ్రేక్ వేసి బోల్తా కొట్టినట్టు చెప్తున్నారు. హైవే అధికారులు కోన్లకు తాళ్ల కట్టి పూర్తి భద్రత తీసుకోకపోవడం వల్ల అది రోడ్డుకు మధ్యలో పడడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో కూడా వీటిని తొలగించకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అభివృద్ధికి కృషి : ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

రౌతులపూడి, మే 15 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం నందు ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఎంపీపీ వ్యవసాయ, విద్య, ఉపాధిహామి తదితర శాఖ తీరుపై సమీక్షించారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు అధికారులు అందుబాటులో ఉండి అభివృద్ధికి సహకరించాలన్నారు. ఎంపీడీవో శివ రామకృష్ణయ్య, వైస్ ఎంపీపీ వాసిరెడ్డి మంగాలక్ష్మి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లున్నారు.

'ఆదిత్య'లో కాటన్ జయంతి



గండేపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీ నందు సర్ ఆర్థర్ కాటన్ 222వ జయంతి పురస్కరించుకుని విగ్రహానికి డిప్యూటీ ప్రోఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాటన్ గోదావరి జిల్లాల వాసులకు నిత్య స్మరణీయుడన్నారు. డీన్ వి.సత్యనారాయణ, గ్రంథాలయ విభాగాధిపతి కె.అశోక్‌కుమార్, ఎండి కలీషా, పీడీ రాంబాబు, ఎ.సుబాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

హైవేపై గుర్తుతెలియని యువకుడు మృతి

ప్రత్తిపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి) ప్రత్తిపాడు-కత్తిపూడి16వ నెంబరు జాతీయ రహ దారిపై గుర్తుతెలియని యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం సాయంత్రం వజ్రకూటం సమీపంలోని పోలవరం కాలువ వద్ద జరిగింది. పోలీసులు సమాచారం మేరకు.. వజ్రకూటం సమీపంలో పోలవరం కాలువ వద్ద 25 నుంచి 30 ఏళ్ల ఉండే గుర్తు తెలియని యువకుడు ఫిట్స్‌తో కొట్టుకుని ఇబ్బందులు పడుతున్న వైనాన్ని అటుగా వెళ్తున్న కొందరు గుర్తించి అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో అంబులెన్స్‌లో ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే యువకుడు మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. టీషర్ట డ్రాయర్ ధరించి ఆరు అడుగుల ఎత్తు వరకు ఉన్న యువకుడి ఆచూకీ తెలిస్తే వెంటనే ప్రత్తిపాడు సీఐ బి. సూర్య అప్పారావు 9440796530, ఎస్ఐ లక్ష్మీకాంతం 94407 96570లో తెలియజేయాలని కోరారు.



మృతిచెందిన యువకుడు

విజ్ఞానాన్ని పెంపొందించేందుకు వేసవి శిక్షణ శిబిరాలు

వై.రామవరం, మే 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యం మెరుగుపరిచేందుకు వేసవి శిక్షణ శిబిరాలు ఎంతో దోహదపడతాయని గ్రంథాలయ అధికారిణి జర్తా సత్యవతి తెలిపారు. గురువారం 15వ రోజు శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు కథలు రాయడం, చిత్రలేఖనం వంటి పోటీలు నిర్వహించారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

వై.రామవరం, మే 15(ఆంధ్రజ్యోతి): పంటలకు సేంద్రియ పదార్ధంగా ఉపయోగపడే పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు అందిస్తున్నట్లు వ్యవసాయాధికారిణి ఉషారాణి తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పలువురు రైతులకు వాటిని పంపిణీ చేశారు. మండలంలో 27 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు విడుదలయ్యాయని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో బాపన్నదొర, ఎంపీపీ ఆనందరావు, జడ్పీటీసీ వెంకటలక్ష్మి, ఎంపీటీసీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డుల జారీకి ఏర్పాట్లు



జగ్గంపేట సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

జగ్గంపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ లేకపోయినా కొత్త రేషన్ కార్డులు జారీకి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందని టీడీపీ నాయకులు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మండలాధ్యక్షుడు మారిశెట్టి భద్రం, నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు జారీ చేస్తుండగా వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కావాలని ప్రభుత్వం నిబంధనలు విధించడంతో ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారన్నారు. దాన్ని దృష్టిలో పెట్టుకుని స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతో పాటు పలువురు నాయకులు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో తగు చర్యలు తీసుకుందన్నారు. దీనిలో భాగంగా కొత్తకార్డులకు దరఖాస్తు చేసుకునేవారికి వీఆర్వో సర్టిఫై చేస్తే సరిపోతుందని తెలియజేశారు. ప్రభుత్వం ట్రాన్స్ జెండర్ కూడా కొత్తకార్డులు జారీ చేస్తుందని టీడీపీ నేతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి రేఖ బుల్లిరాజు, టీడీపీ విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు మండపాకదొర, జగ్గంపేట టౌన్ తెలుగు యువత అధ్యక్షుడు కొండ్రోతు శ్రీను, క్లస్టర్ కో కన్వీనర్ కొల్లు రామకృష్ణ, సుబ్బారాజు ఉన్నారు.

ఓటర్ల జాబితా సవరణలకు సహకరించాలి

జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు

ప్రత్తిపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా సవరణలకు రాజకీయ పార్టీలు సహకరించాలని ప్రత్తిపాడు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు కోరారు. తహశీల్దార్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల నమోదుకు సంబంధించిన ఫారంలను నూతన ఓటర్లు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తహశీల్దార్ ఎం.సూర్యప్రభ, రాజకీయ పార్టీల ప్రతినిధులు, కొండపల్లి శ్రీనివాస్, సింగిలిదేవ్ సత్తిరాజు, ధర్నాల కోట శ్రీను ఉన్నారు.



ప్రత్తిపాడు సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు

పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు : డిప్యూటీ కలెక్టర్

తుని రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా ఉండాలని తుని నియోజకవర్గ ప్రత్యేక అధికారి డిప్యూటీ కలెక్టర్ ఎన్.శ్రీధర్ అన్నారు. మండల ప రిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వైద్య విద్య, సాంఘిక, సంక్షేమ, తాగునీరు సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి సూచనలిచ్చారు. అనంతరం ఏరియా ఆసుపత్రిని పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు, ఎంపీడీవో సాయి నవీన్ పాల్గొన్నారు.



వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న డిప్యూటీ కలెక్టర్

షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టాన్ని ప్రకటించాలి



ఐటీడీఏ ఎదురుగా ఆందోళన చేస్తున్న ఆదివాసీ జేఏసీ

రంపచోడవరం, మే 15(ఆంధ్రజ్యోతి): గిరిజనులకే ప్రాధాన్యత ఇచ్చేలా షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టాన్ని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ జెఏసీ గురువారం రంపచోడవరం ఐటిడిఏ ఎదురుగా ఆందోళన చేపట్టింది. జీవో నెం.3కి ప్రత్యామ్నాయంగా గిరిజన ప్రాంతాలలో గిరిజనులకే ఉద్యోగ అవకాశాలను కల్పించే చర్యలు తీసుకుంటామని ప్రకటించే ప్రభుత్వం ఇందుకోసం అత్యవస రంగా గిరిజన సలహా మండలిని సమావేశపర్చి చట్టాన్ని ప్రకటించా లని డిమాండ్ చేశారు. జెఏసీ నాయకుడు కంగల శ్రీనివాసు ఆధ్వర్యంలో ఈ ఆందోళన చేపట్టారు. ఆదివాసీ న్యాయవాది ఆత్రం నవీన్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నాయకులు పొడియం పండుదొర, చవలం శభకృష్ణ, పండ పవన్, మడకం ప్రసాద్, కారం రామన్నదొర, కుంజం అగ్గిదొర, కత్తుల ఆదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సారా తయారు చేసినా..అమ్మినా కఠిన చర్యలు

దేవీపట్నం, మే 15(ఆంధ్రజ్యోతి): మండల గ్రామాల్లో సారా తయారు చేసినా లేదా అమ్మిన చర్యలు తప్పవని రంపచోడవరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ హెచ్చరించారు. దేవీపట్నం మండలంలోని దేవారం గ్రామ నేరస్తుడు చవళం గంగరాజు గతంలో బైండోవర్ అయి ఉండడం వలన మరల కేసు నమోదుకావడంతో అతన్ని గురువారం తహసీల్దార్ ఎదుట హాజరుపరచగా రూ.10వేలు అపరాధ రుసుము విధించారన్నారు. నవోదయ 2.0లో భాగంగా 76 కేసులు నమోదు చేసి 70 మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని 80 మందిపై బైండోవర్ చేశామన్నారు.

నూకరాజుకు సన్మానం

ప్రత్తిపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి):ప్రత్తిపాడు మండలం ధర్మవరానికి చెందిన ఉత్తరాంధ్ర జిల్లాల అన్నమయ్యక్షేత్ర కమిటీ కన్వీనర్ సానా నూకరాజు నాయుడిని గురువారం పశ్చిమగోదావరి జిల్లా ద్వారకా తిరుమలక్షేత్రంలో కమిటీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. వైశాఖ మాస తిరు కల్యాణ మహోత్సవంలో భాగంగా ద్వారకా తిరుమల క్షేత్రంలో కాకినాడ జిల్లా అన్నమయ్య కమిటీ సభ్యులు నూకరాజు నాయుడు ఆధ్వర్యంలో గురువారం భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాక్షేత్రం ఉత్తరాంధ్ర కన్వీనర్ సానా నూకరాజు నాయుడిని ఏలూరు అన్నమయ్య కళాక్షేత్రం కమిటీ నాయకులు రామారావు, గోపాలరావులతో పాటు ద్వారకా తిరుమల ఆలయ కమిటీకి అధికారులు సన్మానించారు.

రెడ్నం గోవిందరావు మృతి

ప్రత్తిపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు గ్రామ ప్రముఖుడు రెడ్నం గోవిందరావు గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా, టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, సీబీఎన్ ఆర్మీ కోఆర్డినేటర్ యాళ్ల జగదీష్, టీడీపీ నాయకులు పోలిశెట్టి శ్రీను,వెలుగుల నాని సంతాపం తెలిపారు. అలాగే నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు గోవిందరావు నివాళులర్పించారు.

ఉచితంగా మజ్జిగ పంపిణీ



ఏలేశ్వరం, మే15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సంఘం నేతృత్వంలో బాటసారులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తున్నట్టు అధ్యక్షులు సఖిరెడ్డి విజయబాబు తెలిపారు. గురువారం మెయిన్ రోడ్డులో దాతలు ముత్యాల గంగరాజు, నర్ల చిదంబరం ధన సాయంతో బాటసారులకు మజ్జిగ సమకూర్చారు. సంఘ సభ్యులు గోళ్ల నాగేశ్వరరావు, వరుపుల చిట్టిబాబు, రౌతు సహదేవుడు, కోరాడ నారాయణరావు పాల్గొన్నారు.

గణిత తరగతులు

ఏలేశ్వరం, మే 15 (ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు గణిత తరగతులు నిర్వహించారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో ఉపాధ్యాయులు కన్నూరి సతీష్, మామిడి రాము గణితశాస్త్ర సూత్రాలు, గుణాంకాలు, తీసి వేతలు, కూడికలు సులభంగా అర్థమయ్యేరీతిలో వివరించారు.

ధర్మవరంలో వర్షం



ధర్మవరంలో కురుస్తున్న వర్షం

ప్రత్తిపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ధర్మవరంలో గురువారం ఓ మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో గ్రామంలో వర్షం కురిసింది. ధర్మవరానికి సమీపంలో ఉన్న ప్రత్తిపాడు, రాచపల్లి,ఒమ్మంగి గ్రామాల్లో చిరుజల్లులు పడ్డాయి.

క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతి ప్రదానం

తుని రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): తునిలో ఎస్‌కేఎస్‌పీటీ ఆధ్వర్యంలో జరిగిన మెగా పవర్ 20- 20 క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు గురువారం బహుమతి ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ హాజరయ్యారు. కార్యక్రమం సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్ అధ్యక్షతన నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్‌లో జేకే స్వేగర్స్ రాజమండ్రి మొదటిస్థానం సాధించగా ఫ్లేస్ బి క్యూబ్స్ విశాఖపట్నం రెండోస్థానంలో నిలిచింది. కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు తోట నగేష్, ఫెస్ట్రీ ఫుడ్ ఇన్‌ఫ్రాస్ట్రైటర్ రమేష్ నాయకుడు, పట్టణ ప్రముఖులు, క్రీడాకారులు, ప్రజలు పాల్గొన్నారు.